
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శుక్రవారం 28 నవంబరు 2025

నామినేషన్ల పర్వం ప్రారంభం



- ఉత్సాహంగా నామపత్రాలు అందజేసిన అభ్యర్థులు
- జిల్లాలో మొదటి రోజు సర్పంచ్ పదవులకు 100, వార్డులకు 49 మంది దాఖలు
- తొలి విడతలో 7 మండలాల్లోని 192 పంచాయతీల్లో ఎన్నికలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల సంగ్రామం మొదలయ్యింది. గురువారం జిల్లాలో తొలివిడత ఎన్నికలు జరిగే 7మండలాల్లోని 192 గ్రామపంచాయతీల్లో రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. అనంతరం నామినేషన్లను స్వీకరించారు. తొలి విడతలో జరిగే పంచాయతీ ఎన్నికలకు గురువారం ఆశావహులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. మెదటి రోజున సర్పంచ్ స్థానాలకు 100నామినేషన్లు దాఖలవగా, 1,740 వార్డులకుగాను 49నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్ర, శనివారం రెండు రోజుల్లో నామినేషన్ల స్వీకరణ జరగనుంది. ఇక జిల్లాలో పార్టీల మద్దతుతో నామినేషన్లు దాఖలు చేస్తున్నా ఏపార్టీ మద్దతు దారులు గెలిచిన తర్వాత అదేపార్టీకి అనుకూలంగా ఉంటారా? లేక ఇతర పార్టీల్లోకి వెళ్లిపోతారా? అనే అనుమానాలు ఇతరపార్టీల మద్దతుదారులను వెంటాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ముందుగా నామినేషన్లు దాఖలుచేస్తున్నా ఉపసంహరణ నాటికి బరిలో ఎవరుఉంటారనేది తేలనుంది.

తొలి రోజు దాఖలైన నామినేషన్లు ఇలా..

మండలం	సర్పంచ్ స్థానాలు	దాఖలైనవి	వార్డుస్థానాలు	దాఖలైనవి
బోనకల్	22	8	210	5
కొణిజర్ల	27	13	254	9
రఘునాథపాలెం	37	17	308	8
వైరా	22	22	200	7
మధిర	27	19	236	9
ఎర్రుపాలెం	31	4	284	1
చింతకాని	26	17	248	10
మొత్తం	192	100	1740	49

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నిబంధనల మేరకు విధులు చేపట్టాలి
- ఎన్నికల అధికారులకు కలెక్టర్ అనుదీప్ ఆదేశాలు
- రఘునాథపాలెంలో నామినేషన్ ప్రక్రియ పరిశీలన

రఘునాథపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): తొలి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, ఎన్నికల విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అనుదీప్ అధికారులు, ఉద్యోగులకు సూచించారు. గురువారం రఘునాథపాలెం మండలంలోని చింతగుర్తి, గణేశ్వరం, రఘునాథ పాలెం పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. పలు అంశాలను తెలియజేశారు. స్థానిక తహసీల్దార్ శ్వేతతో మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆదేశించారు. నామినేషన్ల స్వీకరణ, ఉప సంహరణ తర్వాత పోటీ అభ్యర్థుల ప్రకటన వారికి కేటాయించిన గుర్తులు లాంటి అంశాలపై పూర్తి బాధ్యతతో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో తొలి విడతలో ఏడు మండలాల్లో 192 సర్పంచులు, 1,740వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. గురువారం నుంచి ఈనెల 29వరకు శనివారం నామినేషన్ ప్రక్రి య ఉంటుందన్నారు. ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎన్నికల కేంద్రాల్లో నామినేషన్ స్వీకరణ జరుగు తుందన్నారు. తొలి విడతలో 3వేల మంది సిబ్బంది విధులు నిర్వ హిస్తున్నారని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్ల వివరాలు, ఓటరు జాబితా వివరాలు సంబంధిత పోటీ చేసే అభ్యర్థులకు సమా చారం అందిస్తామన్నారు. నామినేషన్ కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలు, ప్రచారాలు చేయకూడదన్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే సీజ్ చేస్తామన్నారు.



తహసీల్దార్ శ్వేతకు సూచనలిస్తున్న కలెక్టర్ అనుదీప్

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రి తుమ్మల లేఖ
- ఖమ్మం - అశ్వారావుపేట రోడ్డును వన్ టైం రెన్యువల్ చేయండి
- కొణిజర్ల, కల్లూరు, పెనుబల్లి, దమ్మపేట జంక్షన్లను ఆధునికీకరించండి
- నాలుగు లైన్ల రహదారి, డివైడర్, సెంట్రల్ లైటింగ్, డ్రెయిన్లను మెరుగుపరచాలని వినతి
- సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి గడ్కరీ



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రహ దారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి గురువారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. అనంతరం కేంద్రమంత్రితో ఫోన్లో మాట్లాడిన మంత్రి తుమ్మల పలు రహదారుల పరిస్థితిని వివరిం చారు. ఖమ్మం- అశ్వారావుపేట జాతీయ రహదారిపై అత్యవసరంగా వన్ టైం ఇంప్రూవ్‌మెంట్ (రెన్యువల్) పనులు తక్షణమే చేపట్టాలని కోరారు. ఇప్పటికే ఈ రహదారి నాలుగు లైన్లుగా విస్తరించేం దుకు డీపీఆర్ సిద్ధం చేస్తు న్నట్లు పేర్కొన్నారు. ఆ పనులు ప్రారంభం కావాలంటే సంవత్సరం సమయం పడుతుందని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డు వర్షాల కారణంగా గుంతలు ఏర్పడి అధ్వా నంగా మారిందని ప్రయాణికులు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని మంత్రి లేఖలో ప్రస్తావించారు.

తుమ్మల వివరించిన అంశాలు..

అంతరాష్ట్ర ప్రాధాన్యం కలిగిన ఖమ్మం- అశ్వారావుపేట రహదారి జాతీయ రహదారి 365 బీబీలో భాగమై, రాబోయే (మిగతా 6వ పేజీలో)

ఫారెస్టు సెస్ పేరిట.. బొగ్గు లారీల నిలిపివేత

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వాహనాల యజమానులు
- అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారంటూ ఆవేదన
- ఉత్తర్వులు చూపాలని అటవీఅధికారులను కోరిన సీఐ
- కలెక్టర్ చెప్పిన నేపథ్యంలోనే చర్యలంటున్న డీఎఫ్‌వో

7

పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేద్దాం..

- గ్రామస్థాయిలో టీడీపీ సత్తా చాటుదాం
- కలిసొచ్చే పార్టీలతో నడిచేందుకు సిద్ధం కావాలి
- 'దేశం' ఖమ్మం పార్లమెంట్ కమిటీ కన్వీనర్ రామనాథం



టీడీపీ ఖమ్మం కార్యాలయంలో మాట్లాడుతున్న వాసిరెడ్డి రామనాథం

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసి, ఈ ఎన్నికల ద్వారా సత్తా చాటాలని ఆ పార్టీ ఖమ్మం పార్ల మెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గురువారం ఖమ్మంలోని టీడీపీ కార్యాలయం ఎన్టీఆర్ భవ నంలో జరిగిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఉన్న, కలిసివచ్చే పార్టీలతో అవగాహన కల్పించుకుని టీడీపీ అభ్యర్థులను బరిలో దిం చి పంచాయతీ ఎన్నికల్లో పార్టీకి విజయాన్ని తీసుకురావాలన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకులను గద్దె దించి.. ప్రస్తుత ప్రభుత్వ ఏర్పాటులో టీడీపీ ఎంతో కృషిచేసిందన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇకపై గ్రామస్థాయి నుంచి తెలు గుదేశంపార్టీ పోటీ చేయాలనే సంకల్పంతో ఉందన్నారు. గ్రామ మండల జిల్లా నాయకత్వం మొత్తం శ్రమించి తమతో కలిసి వచ్చే పార్టీలతో నేతలు ఎవరికి వారు సమన్వయం చేసుకుని, వీలైతే ఏకగ్రీవంగా సర్పంచులను, ఉప సర్పంచ్, వార్డు మెంబర్లను దక్కించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నేతలు వనమా వాసు, కొండబాల కరుణాకర్, మల్లెంపాటి అప్పారావు, వడ్డెం విజయ్, గుత్తా సీతయ్య, చెరుకూరి చలపతిరావు, రాజేశ్వరి, మందడపు సుధాకర్, పోటు రామారావు, వాసిరెడ్డి భాస్కరరావు, కనుకుంట్ల కుమార్, ఆర్ఎం రామ య్య, చంద్ర రవి, మందపల్లి కోటేశ్వరరావు, చలసాని ఝాన్సీ, మందపల్లి రజిని, రావుట్ల సత్యనారాయణ, రంజిత్, ప్యారిస్ వెంకన్న, తాత సుధాకర్, కిలారు సురేందర్, గ్రామశాఖల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ పోటీలు నేటినుంచి

- ముస్తాబైన కొత్తగూడెంలోని ప్రొఫెసర్ జయశంకర్ మైదానం
- సింగరేణి ఆధ్వర్యంలో మూడురోజుల పాటు టోర్నీ
- ప్రారంభోత్సవానికి హాజరుకానున్న సీఎండీ బలరాం

కొత్తగూడెం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ కబడ్డీ పోటీలు శుక్రవారం నుంచి మూడురోజుల పాటు కొత్తగూడెం ఏరియాలోని ప్రొఫెసర్ జయ శంకర్ మైదానంలో జరగనున్నాయి. శుక్రవారం ఈ ప్రారంభమయ్యే ఈ ఈ పోటీలకు పలు బొగ్గు కంపెనీల క్రీడాకారులు హాజరుకానుండగా.. సింగరేణి సీఎండీ డైరెక్టర్ బలరాం ప్రారంభోత్సవానికి హాజరుకానున్నారు. ఈ వివరాలను (మిగతా 6వ పేజీలో)

పోలీసుల విస్తృత తనిఖీలు

పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు : సీపీ



ఖమ్మం కొత్త బస్టాండ్‌లో అనుమానితుల వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. అర్ధరాత్రి సమయాల్లో తిరుగు తున్న అనుమానితుల వివరాలు, వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజబుల్ పోలీ సింగ్ పటిష్ఠంగా అమలుచేస్తేనే నేరాలు నియంత్రణలో ఉంటాయని, ఈనేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు. అదే విధంగా పోలీస్ గస్తీపెంచి పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని, హోటళ్ల లాడ్జీలపై సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అదేవిధంగా సరిహద్దు రాష్ట్రాల మీదుగా గంజాయి రేషన్‌బియ్యం, ఇసుక లాంటి అక్రమరవాణా కట్టడి చేసేలా చెక్ పోస్టులు ఏర్పాటుచేసి తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్టు పేర్కొన్నారు.



సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన

- ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి
- కొత్తగూడెం కలెక్టరేట్‌లో సమీక్ష

6

అభిరుచి అలవాటుగా మారాలి

- అదే సంతోషాన్నిస్తుంది.. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది
- చిన్నప్పుడు తపాలా స్టాంపులను ఆసక్తిగా సేకరించా
- అవి దేశచరిత్ర, సంస్కృతి, ప్రకృతి ప్రతిబింబిస్తాయి
- తపాలాశాఖ జిల్లాస్థాయి ఫిలాటెలిక్ ప్రదర్శనలో కలెక్టర్

7



సత్తుపల్లి ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న కమిషనర్ అజయ్‌కుమార్

ఆస్పత్రుల్లో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- వైద్యులు, సిబ్బంది, పరికరాల కొరతపై ఆదేశాలిస్తా
- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్
- సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ

6

నిధుల కొరత.. ప్రగతిపై చింతే!



కొత్తగూడెం నగర పాలకసంస్థ కార్యాలయం

పాల్వంచ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఆస్తి పన్ను చెల్లించేందుకు డివిజన్ కార్యా లయానికి వెళ్లారు. పన్ను ఎంత ఉందని తెలుసుకునేందుకు రెవెన్యూ అధికారులు ఈ మాస్ మిషన్‌లో పరిశీలించగా పన్ను వివరాలు కనిపించలేదు. లాగిన్‌లో కనిపించకపోవడంతో మిషన్ పని చేయడం లేదని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. ఇలా చాలామంది ఆస్తి పన్నులు చెల్లించేందుకు వచ్చి వెనుదిరిగిన వారున్నారు. ఈ క్రమంలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని, ప్రజలు ఎవరూ ప్రస్తుతం పన్నులు చెల్లించవద్దని కార్పొరేషన్ సిబ్బందే సూచిస్తుండటం గమనార్హం.

- కార్పొరేషన్‌గా ఏర్పడినా మారని కొత్తగూడెం తలరాత
- రాబడిలో ప్రగతి పనులకు కేటాయిస్తున్నది తక్కువే
- స్థిరాస్తుల కల్పనకు నామమాత్రపు వ్యయం
- కానరాని ఉమ్మడి ప్రణాళిక సమావేశం
- సమగ్రాభివృద్ధిపై ఆశల్లోనే నగర ప్రజలు

కొత్తగూడెం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 24న ఏర్పాటైన కొత్తగూడెం నగర పాలకసంస్థలో ఆశించిన మేర ప్రగతి కానరావడం లేదు. సమకూరుతున్న ఆదాయంలో మూలధనం నుంచి ప్రగతి పనులకు కేటాయింపులు తక్కువగా ఉండటమే ఇందుకు ప్రధాన కార ణంగా తెలుస్తోంది. ఫలితంగా పౌరసేవలు నగర ప్రజలకు అందని ద్రాక్షలా మారాయి. కార్పొరేషన్ ఏర్పాటు కేవలం కాగితాలకే పరి మితమైందనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తు న్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో ముందస్తు ఆస్తి పన్ను చెల్లించాలని విస్తృ తంగా ప్రచారం నిర్వహిస్తున్న అధికారులు కొత్తగూడెం, సుజాతనగర్ మినహా పాల్వంచలో (మిగతా 6వ పేజీలో)

తొలి నుంచీ ఇదే పరిస్థితి..

కార్పొరేషన్ ఏర్పాటు నుంచి ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆస్తిపన్నుతో పాటు ఇతర పద్దుల కింద వచ్చే ఆదాయంలో వివిధ పథకాల కింద ప్రభుత్వాలు కేటాయించిన నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలకు విని యోగిస్తున్నారు. కొత్తగూడెంలో ఆస్తిపన్ను రూపంలో 20,376సముదాయా లకు రూ.73.56కోట్లను జనరల్ ఫండ్ కింద, పాల్వంచలో 20,394 సము దాయాలకు రూ. 64.62కోట్లను ఖజనాలో జమచేస్తున్నారు. సుజాతనగ ర్‌లో ఆస్తిపన్ను రూపంలో రూ.50లక్షలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. పాల్వంచలో ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యం రూ.64.62కోట్లు కాగా ప్రస్తుతం నూతన భవనాలు, ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా రూ.1.45కోట్లు వసూలు చేశారు. కేవలం పాల్వంచలో ఆస్తి పన్నులు స్వచ్ఛందంగా చెల్లించే వారు.. ప్రస్తుతం పన్నులు తీసుకోకపోవడంతో అయోమయానికి గురవుతున్నారు. భవిష్యత్‌లో అపరాధరుసుంతో కలిపి చెల్లించాలంటే భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనరల్ ఫండ్ నుంచి కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు చెల్లిస్తూ ఎంతకాలం నెట్టుకొ స్తారో వేచిచూడాల్సిందే. ఇప్పటికైనా కలెక్టర్ జితేష్ విపాటిల్ చొరవ చూపి కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యలపై సమీక్ష సమావేశం ఏర్పాటుచే యాలని నగర వాసులు కోరుతున్నారు.

పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ముత్తయ్య



మంత్రి తుమ్మలను కలిసిన రాష్ట్ర పెరిక సంఘం అధ్యక్షుడు ముత్తయ్య

పాల్వంచ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పెరిక కుల ఐక్య సంఘాల రాష్ట్ర అధ్యక్షుడిగా పాల్వంచ మండలానికి చెందిన యర్రంశెట్టి ముత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభల చివరిరోజు గురువారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ యర్రం శెట్టి ముత్తయ్యను రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిక కుల ప్రజలను సామాజికంగా ఆర్థికంగా విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తమవంతుగా కృషి చేస్తామని తెలిపారు. నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మర్యాదపూర్వంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి సత్కరించారు.

కోల్ ఇండియా.. కబడ్డీ పోటీలు నేటినుంచి

(5వ పేజీ తరువాయి)

సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెం రాజు తెలిపారు. గురువారం జయశంకర్ గ్రౌండ్‌లో జరుగున్న ఏర్పాట్లను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. వసతి, భోజన సదుపాయాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కోల్ ఇండియా స్థాయిలో జరిగే క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఏర్పాట్లు పరిశీలించిన వారిలో జీఎంతో పాటు ఎస్ఓటూ జీఎం జీవీ కోటి రెడ్డి, ఏజీఎం (సివిల్)సీహెచ్. రామకృష్ణ, డీజీఎం (పర్సనల్) జీవీ మోహన్ రావు, డీజీఎం (ఈఅండ్ఎం) ఏరియా వర్క్‌షాప్ జె.క్రిస్టోఫర్, స్పోర్ట్స్ సూపర్వైజర్లు ఎంసీ పాస్నెట్, జాన్ వెస్లీ, సీహెచ్.అశోక్, పరసా శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ బి.భీముడు, స్పోర్ట్స్ జనరల్ కెప్టెన్ బి.వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఆర్గనైజర్ సీహెచ్. సాగర్, కె.శ్రీనివాస్‌రెడ్డి, సీహెచ్ ప్రేమ్‌కుమార్, రాజశేఖర్, ఎస్‌కే గులాం గౌస్, మహేష్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఆదివారం మేడారానికి ప్రత్యేక బస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి పెద్దదైన సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే భక్తుల కోసం ఖమ్మం నూతన బస్‌స్టేషన్ నుంచి ప్రతి ఆదివారం మేడారానికి ప్రత్యేక బస్సు అందుబాటులో ఉంటుందని ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ తెలిపారు. జనవరి 28, 2026 నుంచి జనవరి 31 వరకు జరిగే జాతరకు ముందస్తుగానే ఈ నెల 30నుంచి జనవరి 31 వరకు ప్రతి ఆదివారం ఎక్స్‌ప్రెస్ బస్సుసౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం నుంచి మేడారానికి పెద్దలకు రూ.230, పిల్లలకు రూ.120, ఇల్లెందు నుంచి మేడారానికి పెద్దలకు రూ.170, పిల్లలకు రూ.90 చార్జి ఉంటుందని తెలిపారు. ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్ ఆదేశాల మేరకు బస్సులను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొట్ట కూటి కోసం..

- వలస వచ్చిన బెంగాలీ కూలీలు
- యూనిఫామ్‌లో వరి నాట్లకు హాజరు
- స్థానికంగా కూలీల కొరతతో అన్నదాతల ఇబ్బందులు
- నెల రోజుల ముందుగానే యాసంగి సాగుకు సిద్ధమవుతున్న రైతులు



ఎర్రబోయినపల్లిలో యూనిఫామ్‌లో వరి నాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

కల్లూరు, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలో పలు గ్రామాల్లోని రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో రైతులు యాసంగి వరి నాట్లు వేస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత తీవ్రంగా ఉన్నందున ప్రత్యామ్నాయంగా బెంగాలీ రాష్టానికి చెందిన కూలీలు కల్లూరు ప్రాంతానికి వచ్చారు. గత వారం రోజుల క్రితం వలస వచ్చి రైతులతో ఒప్పందం చేసుకొని ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. సాగర్ జలాలను ఆధారంగా చేసుకొని గత వానాకాలం సీజన్‌లో నెల రోజుల ముందుగా వరి సాగు చేయగా సుమారు 33,400 ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈ యాసంగి సీజన్‌లో కూడా అదే స్థాయిలో కల్లూరు ప్రాంతంలోని రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు. వరి సాగులో కల్లూరు మండలం ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయిలో ముందంజలో నిలిచింది. కల్లూరు ప్రాంతంలోని రైతులు కూలీల కొరతను అధికమించేలా ఛత్తీస్‌గఢ్, బెంగాల్ మహారాష్ట్రతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను రప్పించి ఇక్కడ వ్యవసాయ పనులు చేయించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో యాసంగి సీజన్ ప్రారంభంతో బెంగాలీ కూలీలు తరలి వచ్చి ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే బెంగాల్ రాష్ట్రం నుంచి సుమారు 200 మంది కూలీలు ఈ ప్రాంతానికి చెందిన రైతులు తమ పనుల్లో నిమగ్నం చేశారు. 15 మంది కూలీలు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఇలా సదరు ముఠా కూలీలు ఉదయం 5 గంటలకే క్షేత్ర స్థాయిలో వరి పొలాలకు చేరుకుంటారు. సగటున రోజుకు 4 ఎకరాల్లో వరి నాట్లు వేయగా మొత్తం మీద రూ.17 వేలు కూలీ గిట్టుబాటు అవుతుంది. ఒక కూలీకి 1000 నుంచి రూ. 1200 వరకు గిట్టుబాటు అవుతుందని బెంగాలీ కూలీలు చెబుతున్నారు. కూలీలకు గాను భోజనాలు తయారు చేసేందుకు వంట మేస్త్రీను కూడా వారిలో ఒకరిని నియమిచుకుంటారు. ఈ యాసంగి సీజన్ వరి నాట్లు జనవరి నెలలో ముగియనుండగా అప్పటి వరకు ఉంటారని తెలిసింది. ఇంటికి పోయే ముందు సగటున ఒక కూలీ రూ. 50 వేల వరకు ఆదాయం తీసుకోని వెళ్తామని బెంగాలీ కూలీ ముఠా మేస్త్రీలు భప్పా, మంగ్లీలు ఆంధ్రజ్యోతికి చెప్పారు. యూనిఫామ్ దుస్తులతో పురుష కూలీలు నాట్లు వేయటం ప్రత్యేకంగా వారి పనీతీరుకు, క్రమ శిక్షణకు నిదర్శనంగా చెప్పవచ్చు. వారి తోడుగా మహిళ కూలీలు కూడా చంటి పిల్లలతో కుటుంబాల వారిగా పొట్ట కూటి కోసం ఇక్కడకు పనులకు వచ్చారు. ఇక మిర్చి సీజన్లో కూడా వారే కూలీ పనులకు వస్తారు.

నేడు సికిల్‌సెల్, తలసీమియా రోగుల కోసం వైద్య శిబిరాలు

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సికిల్‌సెల్, తలసీమియా దీర్ఘకాలిక రక్తవ్యాధులతో బాధపడుతున్న రోగుల కోసం ఈనెల 28, 29 తేదీల్లో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని ప్రతీ రోగికి నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించాలన్న లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం దుమ్ముగూడెంలోని నర్సాపురం రైతు వేదిక వద్ద, మధ్యాహ్నం భద్రాచలం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 29న ఉదయం అశ్వారావుపేటలోని రైతు వేదిక నారాయణపురం గ్రామపంచాయతీ కార్యాలయం పక్కన, మధ్యాహ్నం చుంచుపల్లి మండలంలోని రామవరం రైతు వేదిక వద్ద ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా నిపుణులైన వైద్యుల బృందం ఈ శిబిరాల్లో అవసరమైన చికిత్స పద్ధతులు వివరించనున్నారు. ఇప్పటికే ఈ వ్యాధులు గుర్తించిన పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా తమ పిల్లలను సమీప శిబిరానికి తీసుకురావాలని, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రుల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్
- సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రి ఆకస్మిక తనిఖీ



కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని మధిర, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జే.అజయ్‌కుమార్ అన్నారు. గురువారం సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా 100పడకల నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ.వెంకటేశ్వర్లుకు పలు సూచనలు చేశారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో నెలకొన్న సమస్యలపై కమిషనర్‌కు వివరించారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రుల భవనాలను ప్రారంభించాలంటే వైద్యులు, సిబ్బందిని నియమించడంతో పాటు సదుపాయాలను అందుబాటులో ఉంచాలని కోరారు. కల్లూరులో ఒక్క వైద్యుడితోనే సేవలందిస్తుండగా కొత్తగా ఎవరూ వచ్చినా ఉండటం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సిబ్బంది, ఔట్‌సోర్సింగ్ విషయంలో ఆసుపత్రులో రోగులకు ఎదురవుతున్న సమస్యలు, వారి పనితీరుపై ఇప్పటికే డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్‌కు వివరించామని, కానీ ఇప్పటివరకు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. స్పెషలిస్ట్ వైద్యులు వచ్చేంతవరకు స్థానికంగా ఎంబీబీఎస్ పూర్తి చేసిన వారితో ఆరోగ్య సేవలందించేలా అనుమతులు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమిచేందుకు వీలు కల్పించాలని కమిషనర్‌ను కోరగా పరిశీలించాలని డీసీహెచ్ఎస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం

- పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షంగౌడ్



మాట్లాడుతున్న దామోదర్‌రెడి

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపడతామని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పులగం దామోదర్‌రెడ్డి, సుంకర భిక్షంగౌడ్‌లు అన్నారు. గురువారం ఉపాధ్యాయ, ఉద్యోగ పెండింగ్ బిల్లులు పెన్షనర్స్ బకాయిలు పెండింగ్ డీఏ, పీఆర్‌సీలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీఆర్టీయూ ఖమ్మం జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెవిలియన్ గ్రౌండ్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద తలపెట్టిన 30 గంటల నిరాహార దీక్షను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎలాంటి మార్పు రాలేదని అన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి, ఇతర పెద్దలతో రాష్ట్ర సంఘం నాయకులు, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి, జేఏసీ నాయకత్వం ఉపాధ్యాయ, ఉద్యోగ పెండింగ్ సమస్యలపై అనేకసార్లు ప్రాతినిధ్యం చేయటం జరిగిందన్నారు. నెలకు రూ.700 కోట్లు బకాయిలు చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో చొరవచేపకపోతే ఖమ్మం జిల్లా శాఖ చేపట్టిన నిరాహార నిరాహా ర దీక్ష రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శు లు కట్ట శేఖర్ రావు, రంగారావు, మోత్కూరి మధు, వెంకట నరసయ్య, చలపతిరావు, యలమద్ది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాచారహక్కు చట్టంతో పారదర్శక పాలన

- ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి



మాట్లాడుతున్న ఆర్టీఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంతో పారదర్శక పాలన సాధ్యమవుతుందని సమాచార హక్కు కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి అన్నారు. సమాచార హక్కు చట్టం దరఖాస్తులపై వచ్చిన అప్పీళ్లను ఆయన గురువారం పరిశీలించారు. అనంతరం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆర్టీఐ సమీక్షా సమావేశంలో సమాచార హక్కు చట్టం అమలు, పెండింగ్ కేసుల పరిశీలన, పౌర సమాచార అధికారుల పనితీరుపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి శక్తినిచ్చే కీలక సాధనం అని, దాని ద్వారా మాత్రమే ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన సాధ్యమవుతాయన్నారు. అవినీతిని నిర్మూలించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యమన్నారు. అందువల్ల ప్రతీ అధికారి చట్టంలోని నిబంధనలపై సంపూర్ణ అవగాహనతో పనిచేయాలన్నారు. అధికారులు, ప్రజలకు సకాలంలో, సరైన, పూర్తి సమాచారాన్ని అందించడం అత్యవసరమన్నారు. ఆర్టీఐ ద్వారా సమాచారం అందించినప్పుడే ప్రజలకు నమ్మకరం పెరుగుతుందన్నారు. గత రెండేళ్లుగా ఆర్టీఐ కమిషన్ నియామకం లేకపోవడం వల్ల పలు దరఖాస్తులు, అప్పీళ్లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పెండింగ్ కేసులన్నింటినీ వేగంగా పరిష్కరించేందుకు జిల్లాల వారీగా పర్యటన చేపడుతున్నామన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులపై పూర్తి వివరాలు సేకరించి, త్వరితగతిన పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పౌర సమాచార అధికారులు తమ శాఖల పరిధిలో ఉన్న కేసుల స్థితిపై వివరాలను కమిషనర్‌కు వివరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ శాఖ తమ కు వచ్చిన సమాచార హక్కుచట్టం దరఖాస్తులను సకాలంలో సమాచారం అందించాలన్నారు. అధికారులు తమశాఖ పరిధిలో సమాచార హక్కు చట్టం దరఖాస్తులు వివరాలతో కూడిన రిజిస్టర్‌లో పొందుపర్చాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు పాల్గొన్నారు.

విధులకు ఉపాధ్యాయుల ఎగనామం

- ఎఫ్ఆర్ఏ వేసి మరీ బయటకు వెళ్లిన వైనం
- మీటింగ్ పేరుతో డుమ్మా కొట్టిన టీచర్
- ఆళ్లపల్లి మండలం బోడాయికుంట బడిలో ఘటన



ఉపాధ్యాయులు లేకపోవడంతో ఆటల్లో నిమగ్నమైన విద్యార్థులు

ఆళ్లపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు విధులకు డుమ్మా కొట్టారు. అది కూడా ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఏ) వేసి మరీ మీటింగు పేరుతో బయటకు వెళ్లిపోయారు. దీంతో ఓ విద్యార్థిని ఉపాధ్యాయురాలి మారాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కొందరు విద్యార్థులు ఆటలకు పరిమితమయ్యారు. ఆళ్లపల్లి మండలం బోడాయికుంట మండల పరిషత్ పాఠశాలలో గురువారం జరిగిన ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఓ ఉపాధ్యాయుడు వివరాలు ఎవరికీ తెలియదు. గురువారం పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు హాజరు వేసుకుని మీటింగ్ పేరుతో బయటకు వెళ్లి మళ్లీ సాయంత్రం వచ్చాడు. దీంతో ఆ ఉపాధ్యాయుడు వచ్చే వరకు అక్కడి విద్యార్థిని ఉపాధ్యాయుడిగా మారిన విషయం వెలుగులోకి వచ్చింది. ఏజెన్సీలో విద్యావ్యవస్థను గాడిన పెట్టేందుకు, ఎఫ్ఆర్‌సీలు, కొత్తకొత్త టెక్నాలజీలు ఎన్ని తీసుకవచ్చినపట్టికి ఉపయోగం లేని పరిస్థితి నెలకొంది. ఆళ్లపల్లి ఎంఈవో ఉపాధ్యాయులపై చర్యలు తీసుకునే విషయంలో మీనమేశాలు లెక్కిస్తున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విషయం మా దృష్టికి రాలేదు: ఎంఈవో శాంతారావు

'ఉపాధ్యాయులకు గురువారం నాడు ఎలాంటి మీటింగులు లేవు, బోడాయికుంట పాఠశాల ఉపాధ్యాయుడు విధులకు హాజరయ్యారు. కానీ పాఠశాలలో లేకపోవడం గురించి మా దృష్టికి రాలేదు' అని ఎంఈవో శాంతరావు తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

(5వ పేజీ తరువాయి)

ఎన్‌హెచ్–365 బీసీలో గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గంలోనూ ఉండటంతో ఈ మార్గానికి ప్రాధాన్యం పెరిగిందని మంత్రి తుమ్మల నితిన్ గడ్కరీకి వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, విశాఖపట్నం పోర్టులకు వెళ్లే వాహనాలు, హైదరాబాద్ నుంచి ఆంధ్రకు వెళ్లే వాహనాలు కూడా ఈ రహదారినే వినియోగిస్తున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ పెరగడం వల్ల రహదారి తీవ్రంగా దెబ్బతినడం, గుంతల వల్ల ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రోడ్డుకు పునరుద్ధరణ పనులు చేయడం అత్యవసరమని మంత్రి పేర్కొన్నారు.

రహదారిని ఫోర్‌లైన్‌గా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధం చేసే పనులు ప్రారంభమైనా, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా మరింత సమయం పడుతుందని మంత్రి తుమ్మల లేఖలో స్పష్టం చేశారు. భారీ ట్రాఫిక్, నిరంతర ప్యాచ్ వర్క్, నాసిరకం ఉపరితలం కారణంగా ఎన్‌హెచ్ఏఐ చేసిన మరమ్మతులు కూడా ఎక్కువకాలం నిలవడం లేదని మంత్రి వివరించారు. దీనివల్ల ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

నాలుగు లేన్ల రోడ్డు ప్రాజెక్టులు పూర్తికావడానికి సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత ఎన్‌హెచ్-365బీబీ పై వన్ టైం ఇంప్రూవ్మెంట్ చేపట్టడం తప్పనిసరి అని మంత్రి తుమ్మల లేఖలో స్పష్టం చేశారు. జగ్గయ్యపేట-కొత్తగూడెం వయా వైరా జాతీయ రహదారి మంజూరు కోసం జగ్గయ్యపేట- కొత్తగూడెం వయా వైరా జాతీయ రహదారిని మంజూరు చేయాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. జాతీయ రహదారి 65 మీద ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నుంచి జాతీయ రహదారి 30మీద ఉన్న కొత్తగూడెం వరకు కొత్త రహదారి ఆమోదం లభిస్తే రెండు ప్రధాన జాతీయ రహదారులు అనుసంధానం కావడంతో పాటు తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రజలకు వేగవంతమైన, సురక్షితమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని మంత్రి పేర్కొన్నారు. జగ్గయ్యపేట నుంచి బోనకల్, వైరా, తల్లాడ మీదుగా కొత్తగూడెం వరకు ఈ రహదారిని మంజూరు చేయాలని ఆయన కోరారు.

ప్రస్తుతం ఈ మార్గం రాష్ట్ర రహదారిగా ఉందని, దీనిని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేస్తే భద్రాచలం వచ్చే భక్తులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని కల్పించవచ్చని మంత్రి తెలిపారు. ఈ రోడ్డు అభివృద్ధి ద్వారా ప్రధాన పరిశ్రమల క్లస్టర్ల మధ్య కనెక్టివిటీ మెరుగుపడటంతో జగ్గయ్యపేట సిమెంట్ పరిశ్రమలు, కొత్తగూడెం, పాల్వంచ, అశ్వపురం, మణుగూరు ప్రాంతాల్లోని పరిశ్రమలకు రవాణా సదుపాయాలు గణనీయంగా మెరుగుపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల, కల్లూరు మున్సిపాలిటీ, పెనుబల్లితో పాటు భద్రాద్రికొత్తగూడెం జిల్లాలోని దమ్మపేట(మందలపల్లి) జంక్షన్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని ఆధునిక ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని మంత్రి గడ్కరీని కోరారు. అలాగే ఈ ప్రాంతాల్లో కొత్తగా నాలుగు వరుసల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, డ్రెయినేజీ వ్యవస్థ లాంటి ఏర్పాట్లు అత్యవసరమని, కాబట్టి వీటిని వెంటనే మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కోరారు. ఇదే అంశంపై మినిస్ట్రీ ఆఫ్ రోడ్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ హైవేల రిజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్‌కు వేరుగా లేఖ రాసినట్టు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లాకు నిరంతర రహదారి అనుసంధానానికి ఈ పనులు అత్యంత కీలకమన్న మంత్రి తుమ్మల, అవసరమైన అనుమతులు, నిధులు వెంటనే మంజూరు చేసి తక్షణమే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. దీనికి స్పందించిన కేంద్రమంత్రి తక్షణమే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనానికి ఆహ్వానం



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్

పాల్వంచ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని బొమ్మసాని సుగంధినికి అంతర్జాతీయ గుర్తింపు లభించిందని స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థిని సుగంధినిని అభినందించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) ప్రపంచ సాహిత్య వేదిక ప్రతిష్ఠాత్మకంగా నవంబరు 30న అంతర్జాలంలో 13 గంటల పాటు బాల సాహిత్య భేరి పేరుతో అంతర్జాతీయ బాల రచయితల సమ్మేళనం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ విశేష కార్యక్రమంలో పాల్గొనడానికి సుగంధినికి ఆహ్వానం అందటం గర్వించదగ్గ విషయమని అన్నారు. కథ, వచన కవిత్వం, గేయం, పద్యం విభాగాల్లో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు విద్యార్థినీ విద్యార్థులు 101 మంది పాల్గొంటారని తెలిపారు. ఈ చిన్నారి కథ విభాగంలో ఎంపికయ్యిందని, మూడు నిమిషాల పాటు కథ వినిపించనుందని తెలిపారు.

నాణ్యమైన విద్య అందించాలి

- ఖమ్మం జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో చైతన్యజైనీ

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివేటువంటి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని, పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్ని రంగాలలో ముందంజలో ఉండేలా వినూత్నమైన కార్యక్రమాలకు రూపకల్పన జరపాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ అన్నారు. గురువారం నూతన కలెక్టరేట్ భవనములోని మీటింగ్ హాల్లో జిల్లాలోని 28 పీఎం శ్రీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులను విజ్ఞాన యాత్రలకు తీసుకొని వెళ్లడం, వారికి శాస్త్ర సాంకేతిక రంగాలు, పరిశోధన, అభివృద్ధి రంగాలపై మక్కువ పెరిగేలా మరిన్ని ఇంటరాక్షన్ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, క్వాలిటీ కోఆర్డినేటర్ పెసర ప్రభాకర్ రెడ్డి, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ రూబీ, మండల విద్యాశాఖ అధికారులు వీరస్వామి, వెంకటేశ్వర్లు, నివేదిత, సత్యనారాయణ పాల్గొన్నారు.

తల్లిని మరిపించేలా బోధన చేయాలి

చిన్నారులతో మమేకమై, తల్లిని మరిచేలా బోధన ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ అన్నారు. గురువారం జిల్లా విద్యా శిక్షణ కేంద్రం ఖమ్మంలో జరుగుతున్నటువంటి ప్రీ ప్రైమరీ పాఠశాలల ఇన్‌స్ట్రక్టర్ ఐదు రోజుల శిక్షణ శిబిరానికి హాజరై మాట్లాడారు. పిల్లలతో మమేకమే బోధన చేయడం వలన మొదటి గురువుగా వారి మిమ్మల్ని చిరకాలం గుర్తుంచుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రవీణ్ కుమార్, జిల్లా రిసోర్స్ పర్సన్లు శ్రవణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కబాల్య వివాహం కూడా జరగకుండా చూద్దాం

ఖమ్మం జిల్లాలో ఒక్క బాల్య వివాహం కూడా జరగకుండా చూద్దామని జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత, జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ గుంటుపల్లి భారతరాణి అన్నారు. నవంబరు 27 జాతీయ బాల్య వివాహ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ (ఎయి డ్)సంస్థ, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో ని గాంధీచౌక్ నందు బాలికల జూనియర్ కళాశాలలో వంద రోజుల బాల్య వివాహ నిరోధక కార్యాచరణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవి బాబు మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చదివే బాల బాలికలకు మత్తు పదార్థాలు, సామాజిక మాధ్యమాలు వినియోగం పట్ల ప్రతి వా రాంతంలో విషయాన్ని నిపుణులచే కౌన్సిలింగ్ నిర్వహిస్తూ వారిని సరైన మార్గంలో ఉండేలా చూస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ డైరెక్టర్ వాణి హరి ప్రసాద్‌రావు, డాక్టర్ బిందు శ్రీ పాల్గొన్నారు.

నిధుల కొరత.. ప్రగతిపై చింత!

(5వ పేజీ తరువాయి)

ఆస్తిపన్ను చెల్లిస్తామంటే తీసుకోవడం లేదు. రాష్ట్రంలో ఏ మునిసిపాలిటీకి లేని అవస్థలు పాల్వంచ డివిజన్ కార్యాలయానికి ఏర్పడుతున్నాయి. పాల్వంచలోని ఆస్తి పన్ను, ట్రేడ్ లైసెన్స్‌లు కార్పొరేషన్ లాగిన్‌కు బదలాయింపునకు నోచుకోక సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ)లో సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

కానరాని ఉమ్మడి ప్రణాళిక ..!

పాల్వంచ-కొత్తగూడెం జంట పట్టణాల మధ్య కలెక్టరేట్ నిర్మాణంతో పాటు విద్యాసంస్థలు, పరిశ్రమలు, టూరిజం హబ్‌లు శరవేగంగా ఏర్పాటవుతున్నాయి. ఇంతటి ప్రాముఖ్యం కలిగిన ఈ ప్రాంతాల్లో చిన్నపాటి అవసరాలు తీరే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ ప్రాంతాల మధ్య సెంట్రల్ పార్క్ ఉంది. త్వరలో జూ పార్క్, హరిత హోటల్, కాటేజీలు రాబోతున్నాయి. జంట పట్టణాలు, సుజాతనగర్ నుంచి కార్పొరేషన్ తరఫున నగర సమస్యలపై పట్టుమని పది నిమిషాలు ప్రత్యేక అధికారి సమక్షంలో చర్చించిన దాఖలాలు లేవు. కొత్తగూడెం, పాల్వంచ మునిసిపాలిటీలు, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల్లో పనిచేసిన ఉద్యోగులకు.. కార్పొరేషన్ ఏర్పడి తొమ్మిది నెలలు అయినా నిరాశే మిగిలింది. ప్రజలు చెల్లించే పన్నులు పెరిగనట్టే ఉద్యోగులకు హెచ్ఆర్ఏ కూడా పెరుగుతుందని ఆశించారు. కానీ నేటివరకు కాగితాలకే కార్పొరేషన్ ఏర్పాటు ప్రక్రియ పరిమితమవ్వడంతో నగర అభివృద్ధి నత్తతో పోటీపడుతోంది. కార్పొరేషన్ పరిపాలన ఇన్‌చార్జ్ కమిషనర్ పర్యవేక్షణలో కొనసాగుతుండటంతో ఆస్తిపన్నులు బదలాయింపులు సైతం నత్తనడకన సాగుతున్నాయి. నగర భవిష్యత్‌కు ఆయువుపట్టులా మారబోతున్నా ప్రాంతం అభివృద్ధిపై నేటికి సరైన ప్రణాళిక రూపొందించలేదు.

హామీలు గుప్పిస్తున్న అభ్యర్థులు

మేనిఫెస్టోల ప్రకటనతో గ్రామాల్లో విస్తృత చర్చ



నేలకొండపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో పంచాయతీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. బరిలో ఉండాలనుకునే అభ్యర్థులు తమను గెలిపిస్తే గ్రామానికి ఎటువంటి పనులు చేస్తామో హామీలు గుప్పిస్తున్నారు. అందులో భాగంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని మూటాపురం, అనాసాగరం గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌గా పోటీ చేయాలనుకుంటున్న రావెళ్ల కృష్ణారావు, పంబ రవి తమ తమ గ్రామాల వారికి భారీగా హామీలు ఇచ్చారు. ఇప్పుడు ఈ అంశం సోషల్‌మీడియా వేదికగా తీవ్ర చర్చనీయాంశమైంది. సుమారు రూ.కోటి మేరకు మేనిఫెస్టో విడుదల చేశారంటూ చక్కర్లు కొడుతోంది. ఏకగ్రీవంగా గెలిస్తే తాము గ్రామానికి చేసే పనులివీ అంటూ సంచలనం సృష్టించారు.

మేనిఫెస్టోల్లోని అంశాలివీ..

ఆలయాల అభివృద్ధి, బతుకమ్మ సంబురాలకు విరాళాలిస్తామని ప్రకటించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు అందరి ఇళ్ల పన్ను, నల్లా బిల్లులు తాము చెల్లిస్తామని హామీ ఇచ్చారు. వైద్యశిబిరాలు నిర్వహించి, పేదలకు ఉచితంగా మందులను పంపిణీ, ప్రతీ దేవాలయానికి ప్రతీ ఏటా రూ.50వేలు ఉత్సవాల నిర్వహణకు విరాళం, వినాయక చవితికి అన్ని ఉత్సవ కమిటీలకు విగ్రహాలను ఉచితంగా అందిస్తామన్నారు. గ్రామంలోని చర్చి, మజీద్‌లకు ఏటా రూ.50వేల చొప్పున అందిస్తామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఆగస్టు 15, జనవరి 26న నిర్వహించే కార్యక్రమాలకు బహుమతులను అందజేస్తామని తెలిపారు. బాగా చదివే విద్యార్థులకు ప్రతీ తరగతి నుంచి ఇద్దరిని ఎంపిక చేసి ప్రతీ సంవత్సరం రూ.2వేల చొప్పున స్కాలర్‌షిప్‌గా అందజేస్తామని, బయటి పాఠశాలల్లో చదివే గ్రామానికి చెందిన విదార్థులను ఏటా పది మంది చొప్పున ఎంపికచేసి సైకిళ్లను ఇస్తామని ప్రకటించారు. సంక్రాంతి పండుగకు ముగ్గుల పోటీలు నిర్వహించి.. బహుమతులు అందిస్తామని, అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం, దసరా పర్వదినానికి ప్రతీ ఏడాది 100 మంది పేదలకు దుస్తులు, 10 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేస్తామని తెలిపారు. సొంత ఖర్చులతో గ్రామంలో గ్రంథాలయ భవన నిర్మాణం, నిర్వహణతో పాటు మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటుచేసి ప్రతి ఇంటికీ ఉచితంగా మినరల్ వాటర్‌ను ఇస్తామన్నారు. పెళ్లిళ్లు, జాతరలకు డీజే, మైకును స్వయంగా ఏర్పాటు, గ్రామానికి డెడ్‌బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం ఏర్పాటు చేస్తామన్నారు. పేద కుటుంబాల్లోని ఆడ పిల్లల వివాహాలకు చీర, సారె కానుకగా అందజేస్తామన్నారు. వికలాంగులకు ఉచితంగా ట్రైసైకిళ్లను అందచేస్తామని ప్రకటించడం సంచలనంగా మారింది.

పల్లె సమరం 2025

మీకు తెలుసా..!

పంచాయతీరాజ్ చట్టాల తీరు ఇలా..

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ సంస్థలను బలోపేతంచేసే చర్యల సిఫార్సుల కోసం 1986లో సాంగ్లీ కమిటీని నియమించింది.

- ఆ కమిటీ సూచనల మేరకు పలు సవరణలతో కూడి పంచాయతీ రాజ్ బిల్లును 1992లో 73వ రాజ్యంగ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు.
- బిల్లు 1993 ఏప్రిల్ 24న రాష్ట్రపతి అనుమతితో అమల్లోకి వచ్చింది.
- ఈ చట్టంలో 243ఎం ప్రకారం షెడ్యూల్ 5, షెడ్యూల్ 6 ప్రాంతాల్లో ఈ చట్టం అమలు జరగదని స్పష్టంచేశారు. భారత పార్లమెంట్ చట్టంలో కొన్ని ప్రాంతాలకు మినహాయించడానికి ఇదే తొలిసారి.
- షెడ్యూల్ 5లో ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి.
- 1973వ రాజ్యాంగ సవరణ చట్టంలో 243ఎం ప్రకారం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చేందుకు తగిన సూచనలు ఇవ్వడానికి గాను బీఎస్. బూర్యా అధ్యక్షతన పార్లమెంట్ సభ్యులతో నిపుణులతో 1994 జూన్ 10న ఒక కమిటీని నియమించారు.
- ఆ కమిటీ 1994 జనవరి 17న నివేదికను సమర్పించింది. దాని ఆధారంగా పార్లమెంట్‌లో బిల్లుపెట్టడం, డిసెంబరు 19 1996లో ఆమోదం పొందింది. 1996 డిసెంబరు 24న రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా రూపొందింది.
- దీన్నే పంచాయతీరాజ్ చట్టాన్ని ట్రైబల్ ప్రాంతాలకు విస్తరింప చేసిన చట్టంగా (40)గా అమల్లోకి వచ్చింది.
- ఈ చట్టం 8 రాష్ట్రాల్లోని షెడ్యూల్ ప్రాంతాల్లో అమలవుతోంది.
- ఆ తర్వాత ఇటీవలె తెలంగాణ రాష్ట్ర విభజన అనంతరం పంచాయతీరాజ్ చట్టానికి 2018లో మెరుగులు దిద్ది కొత్త చట్టాన్ని తెలంగాణ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది.

సర్పంచ్ నెల జీతం రూ.5 వేలు

గతంలో రూ.600 మాత్రమే! 2015 ఏప్రిల్ 1 నుంచి వేతనం పెంపు



ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సర్పంచిగా గెలవడానికి పెద్ద సంఖ్యలో ఆశావహులు కుతూహల పడుతున్నారు. దీనికోసం రూ.లక్షల్లో ఖర్చుచేయడానికి కూడా వెనుకాడడంలేదు. సర్పంచ్ సీటు కోసం పాట్లు పడుతున్నారు. ఇంతా చేస్తే అసలు గ్రామ సర్పంచిగా గెలిస్తే నెల జీతం ఇచ్చేది ఎంతో తెలుసా.. కేవలం రూ.5వేలు మాత్రమే...! అదీ తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2015 ఏప్రిల్ 1 నుంచి సర్పంచ్‌లకు వేతనాలను పెంచింది. గతంలో గ్రామ సర్పంచ్ వేతనం నెలకు రూ.600 మాత్రమే ఉండేది. మేజర్ పంచాయతీలు అయితే రూ.వెయ్యి మాత్రమే ఇచ్చేవారు. ఇవీ కూడా నెలకు టంచన్‌గా వస్తాయంటే కాదు.. ప్రతి నాలుగు నెలలు, ఆరు నెలలకోమారు ప్రభుత్వం గ్రాంటు విడుదల చేస్తూ ఉంటుంది. అయితే గతంలో గ్రామ పంచాయతీకి వచ్చే సాధారణ గ్రాంటు నుంచి సర్పంచ్‌ల వేతనాలు తీసుకునే వారు. కానీ తెలంగాణ ప్రభుత్వం నేరుగా సర్పంచ్‌ల ఖాతాకే వేతనాన్ని ఖజానాశాఖ ద్వారా జమచేస్తుంది. మరీ ఇంత తక్కువ వేతనానికి అంతపోటీ ఎందుకోమరి అనే అనుమానం కలుగక తప్పదు. గ్రామస్థాయిలో సర్పంచి అంటే ఆ హోదానే వేరు.. ఆ దర్పమే వేరు... అందుకే లక్షల రూపాయలు ఖర్చు పెట్టినా పంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందాలని ఉవ్విళ్లూరుతున్నారు...!

రాష్ట్ర విభజన తర్వాత తొలిసారి ఎన్నికలు



సారపాక గ్రామపంచాయితీ కార్యాలయం

బూర్గంపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విభజన అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల పరిధిలోని పారిశ్రామిక ప్రాంతమైన సారపాక గ్రామ పంచాయతీకి తొలిసారి ఎన్నికలు జరుగుతున్నాయి. సారపాక గ్రామ పంచాయతీకి చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగ్గా.. చివరి సర్పంచ్‌గా ధరావత్ చందునాయక్ వ్యవహరించారు. 2018లో ఆ పాలకవర్గం ముగిసింది. 2018లో మున్సిపాలిటీగా మారుస్తున్నట్టు వార్తలొచ్చాయి. అదే సమయంలో ఇక్కడ గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించలేదు. దీంతో పలువురు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వం రెండు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం సారపాకను ఒకటిగానే ఉంచాలని నిర్ణయించడంతో అధికారులు ఎన్నికల ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాన్ని అధికారులు ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో ఎట్టకేలకు గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు ఆశావహులు ఎవరికి వారు సర్పంచ్ స్థానాన్ని దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. దీంతో పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో ఎన్నికల సందడి నెలకొంది.

పత్తాలేని రిటర్నింగ్ అధికారి

అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సైతం విధులకు గంట ఆలస్యంగా హాజరు

దుమ్ముగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రం రిటర్నింగ్ అధికారి మధ్యాహ్నం రెండు గంటలకు తాపీగా విధులకు హాజరయ్యారు. ఉదయం 10.30 గంటలకు హాజరు కావాల్సిన బాధ్యతలు గల కీలకమైన అధికారి ఆలస్యంగా రావడంతో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ల సమర్పణ కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అలాగే అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి సైతం గంట ఆలస్యంగా 11.30కు హాజరయ్యారు. లక్ష్మీనగరం, గంగోలు, ములకపాడు, దుమ్ముగూడెం, సుబ్బారావుపేట పంచాయతీల నామినేషన్ల స్వీకరణ కోసం లక్ష్మీనగరంలో నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.



అధికారులు లేని నామినేషన్ కేంద్రం

అభిరుచి అలవాటుగా మారాలి

అదే సంతోషాన్నిస్తుంది.. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది
చిన్నప్పుడు తపాలా స్టాంపులను అసక్తిగా సేకరించా
అవి దేశచరిత్ర, సంస్కృతి, ప్రకృతి ప్రతిబింబిస్తాయి
తపాలాశాఖ జిల్లాస్థాయి ఫిలాటెలిక్ ప్రదర్శనలో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రదర్శనను ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం మామిళ్లగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'ప్రతీ వ్యక్తికి సంతోషాన్ని కలిగించే సంతృప్తికరమైన అభిరుచి అలవాటుగా మారాలని, దాంతో వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, జిజ్ఞాస పెరుగుతుంది' అని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పేర్కొన్నారు. ఖమ్మం డీపీఆర్సీ భవనంలో తపాలా శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఖమ్మంజిల్లా స్థాయి ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల తపాలా స్టాంపుల ప్రదర్శనను ఆయన విద్యార్థులతో కలిసి అసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ చిన్నతనంలో తాను పోస్టల్ స్టాంపులను ఆసక్తితో సేకరించేవాడినని, స్నేహితులతో తపాలా స్టాంప్‌లను మార్చుకొని పెద్ద కలెక్షన్ పెట్టుకునే వాడినని గుర్తు చేసుకున్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నడం ఆనందంగా ఉందన్నారు. చిన్నతనంలో కరీంనగర్ జిల్లాకు చెందిన చాలామంది ఉపాధి అవకాశాల కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లే వారని, వారి తల్లిదండ్రులు అక్కడకు వెళ్లినప్పుడు అక్కడి స్టాంపులు తీసుకుని రావాలని తాను కోరేవాడినని కలెక్టర్ తెలిపారు. స్టాంపుల సేకరణతో ఒక దేశ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి గురించి తెలుస్తుందని, విజ్ఞానం పెరుగుతుందన్నారు. ఫిలాటెలిక్ ఎగ్జిబిషన్ పిల్లలకు చాలా ఉపయోగ పడుతుందన్నారు. ప్రస్తుత తరం డిజిటల్ వైపు అడుగులు వేస్తోందని, స్నేహితులతో బయట ఆడుకోవడం చాలా తగ్గిపోయిందని, దీనివలన లాభాలకంటే నష్టం ఎక్కువగా ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఫిలాటెలిక్ అలవాటు పోస్టల్ స్టాంపు సేకరణ చాలా ఆనందం కలిగిస్తుందని, కొంచెం శ్రమ పెట్టి సేకరించిన స్టాంపులు లేదా ఇతర హాబీల వల్ల మనకు సంతృప్తి దొరుకుతుందన్నారు. అనంతరం జిల్లా పోస్టల్‌బీమా పాలసీ పరిహారం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తపాలాశాఖ పర్యవేక్షకులు వీరభద్రస్వామి, పోస్ట్ ఆఫీస్ సిబ్బంది, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

జై శ్రీరామ్ నామంతో ఇటుకలను తయారు చేసిన దేవస్థానం ఈవో

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న సమాచార కమిషనర్ అయోధ్యరెడ్డి



రామాలయంలో సమాచార కమిషనర్ అయోధ్యరెడ్డి

భద్రాచలం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి):: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో జైశ్రీరామ్ నామంతో ఇటుకలను దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు తయారు చేశారు. గోశాల వద్ద జైశ్రీరామ్ నామంతో ఇటుకల తయారీ చేపడుతుండగా గురువారం ఈవో ఇటుకల తయారీని పరిశీలించారు. ఆ సమయంలో ఈవో సైతం ఇటుకలను తయారు చేశారు. నూతన నివాస, వసతి భవన నిర్మాణాలు చేపట్టనున్న తరుణంలో భద్రాద్రి రామయ్య ప్రసాదంగా వినియోగించేందుకు జై శ్రీరామ్ నామంతోదేవస్థానం ఇటుకలను సిద్ధం చేస్తోంది. వీటిని త్వరలో దేవస్థానం తరఫున అధికారికంగా విక్రయించేందుకు రంగంసిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉండగా భద్రాద్రి రామయ్యను రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ బి.అయోధ్యరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఈ సమయంలో ఆలయ ప్రాశస్త్యంను వైదిక సిబ్బంది ఆయనకు వివరించారు. అనంతరం స్వామివారి ప్రసాదం, కండువాను సమాచార కమిషనర్ అయోధ్యరెడ్డికి దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఈవోతో పాటు ఏఈవో శ్రావణ్‌కుమార్, దేవస్థానం వేద పండితులు కె.కామేశ్వరశర్మ, మల్లారి రవికుమార్ శర్మ, భద్రాచలం తహసీల్దారు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఫారెస్టు సెస్ పేరిట బొగ్గు లారీల నిలిపివేత

పోలీసులకు ఫిర్యాదు చేసిన లారీ ఓనర్లు
అనధికార వసూళ్లకు పాల్పడొద్దు
ఉత్తర్వులు ఉంటే చూపండి : సీఐ
కలెక్టర్ సూచించినట్లుగానే చర్యలు తీసుకున్నాం: డీఎఫ్‌వో



బొగ్గు లారీలను నిలిపి వేసిన ఫారెస్టు అధికారులు సిబ్బంది

మణుగూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఎన్నడూ ఎరుగని రీతితో గురవారం ఓ సంఘటన చోటుచేసుకుంది. ఫారెస్టు అధికారులు బొగ్గు లారీలను ఆపి ఫారెస్టు సెస్ పేరిట లారీకి రూ.200 కట్టాలని ఆదేశించారు. ఎన్నడూ లేని విధంగా ఫారెస్టు అధికారులు జీఎం కార్యాలయం దిగువ ప్రాంతం విప్పల సింగారం ప్రధాన రహదారిపై లారీలను నిలపడం 14టైర్ టిప్పర్ లారీ ఓనర్స్ అసిసోసియేషన్ అవాక్కైంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఫారెస్టు రేంజర్ ఇతర అధికారులతో మాట్లాడారు. అయితే ఎఫ్‌డీవో సయ్యద్ మక్సూద్ మోహినుద్దీన్ ఆదేశాల మేరకు లారీలను నిలిపివేసినట్లు ఫారెస్టు సిబ్బంది తెలిపారు. ఈ విషయంపై ఈశ్వర్‌రెడ్డి మణుగూరు సీఐ నాగబాబుకు ఫిర్యాదుచేయగా ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని జరుగుతున్న వ్యవహారంపై ఆరా తీశారు. అయితే ఫారెస్టు డివిజన్ అధికారితో మాట్లాడారు. అయితే ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ సమావేశంలో ఇసుక లారీలు, బొగ్గు లారీల నుంచి ఫారెస్టు చెస్ వసూళ్లు చేయాలని కలెక్టర్ సూచించారని ఎఫ్‌డీవో తెలిపారు. ఇందుకు సంబంధించి కాగితం ముఖంగా ఉత్తర్వులు ఉంటే ఓ చెక్ పాయింట్ ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇలా ఎలాంటి ఉత్తర్వులు లేకుండా అక్రమంగా లారీలను ఆపి ఇబ్బందులు పెట్టవద్దని సీఐ ఫారెస్టు అధికారులకు సూచించారు. దాదాపు 15లారీలను రోడ్డుపై ఫారెస్టు సిబ్బంది నిలిపివేశారు. స్పష్టమైన ఉత్తర్వులు చూపాలని సీఐ ఫారెస్టు అధికారులను కోరగా డీఎఫ్‌వో ఉత్వర్వులను సిబ్బందికి చూపారు. అయితే కలెక్టర్ నుంచి ఖచ్చితమైన ఉత్తర్వులు ఉంటే ఫారెస్టు సెస్ వసూలు చేసుకోవాలి కానీ, ఇలాకాదని సీఐ ఫారెస్టు సిబ్బంది తెలిపి నిలిపిన లారీలను బీటీపీఎస్‌కు తరలించారు. కాగా ఈ విషయంపై ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ టన్నుకు రూ.30 చొప్పున సింగరేణి ఫారెస్టు సెస్ పేరిట ఒక్కో లారీకి రూ.880 వసూలు చేస్తోంది. ఆ నగదు ఫారెస్టు చెందుతుందో లేదో తెలియదన్నారు. లారీకి రూ.880తో పాటు అదనంగా లారీకి రూ.200 కట్టాలని అధికారులు నిలిపివేయడం తమను, కమిటీ సభ్యులను విస్మయానికి గురి చేసిందన్నారు. ఎట్టకేలకు సీఐ జోక్యంతో ఆపిన లారీలను పంపించారు. ఫారెస్టు సెస్ పేరిట ఈ వసూళ్లు అధనపు భారం అవుతుందని లారీఓనర్లు పేర్కొంటున్నారు.

నాలుగు విష సర్పాలను అడవిలో వదిలిన రెస్క్యూ సభ్యులు



విష సర్పాలను అడవిలో వదులుతున్న రెస్క్యూ సభ్యుడు సంతోష్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం అటవీ ప్రాంతంలో నాలుగు విష సర్పాలను వ్యవస్థాపక అధ్యక్షుడు సంతోష్, రెస్క్యూ సభ్యుడు శ్రీకాంత్ గురువారం వదిలారు. కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లలోకి సర్పాలు చేరిన సమాచారంతో వెళ్లి సురక్షితంగా పట్టుకొని చంపకుండా కాపాడిన ఆ సర్పాలను క్షేమంగా విడిచి పెట్టారు. వాటిలో మూడు నాగుపాములు ఉండగా ఒక జెర్రిపోతు పాము ఉంది. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మనుషులకు, సర్పాలకు రెండు విధాలుగా మేలు చేయడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఎలుకలు, పందికొక్కులు, పందులు, కుక్కలు వలే పాములు ఎలాంటి వ్యాధికారకాలు కావని ఇళ్ల లోపలికి చేరకుండా తలుపులు, కిటికీలకు జాలి అమర్చుకుంటే సమస్య ఉండదన్నారు. సర్పాలు ప్రకృతిలో భాగమేనని వాతావరణంలో మార్పులు ఆహారం కోసమే సర్పాలు బయటకు వస్తాయని ప్రత్యేకించి ఈ చలికాలంలో వెచ్చదనం కోసం ఇళ్ళ లోపలికి వస్తాయని, రాత్రులు వెలుతురు ఉండేలా జాగ్రత్త పడాలని వారు వివరించారు.

దొంగల హల్‌చల్..

ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి కాపర్ వైర్ చోరీ
ఆందోళనలో రైతులు
పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విద్యుత్ అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌ను అపహరించిన దొంగలు

కరకగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం అవడంతో మారుమూల గ్రామాలు ఉండటంతో దొంగలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఎక్కువగా వ్యవసాయ పొలాలు ఉంటాయి. రైతులు తమ పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్లకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉంటాయి. ఇదే అదునుగా చూస్తున్న దొంగలు రాత్రి సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లను పగలకొట్టి అందులో ఉన్న కాపర్ వైర్లు దొంగిలిస్తూ మండలంలో హల్‌చల్ చేస్తున్నారు. బుధవారం రాత్రి మండలంలోని రేగళ్ళ పంచాయతీ మద్దెలగూడెం సమీపంలోని కొమరం సూరి అనే రైతుకు చెందిన పామాయిల్ తోటలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు కిందపడవేసి అందులోని కాపర్ వైర్లను అపహరించారు. దీంతో సుమారు రూ.లక్ష నష్టం జరిగిందని, దొంగలు ఎత్తుకెళ్లిన కాపర్ వైర్ల విలువ రూ.40 వేలు ఉంటుందని పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ తెలిపారు. గతంలో భట్టుపల్లిలో రెండు మార్లు, కలవల నాగారం, మేతెలో రెండు మార్లు, అనంతారం, వీరాపురం క్రాస్‌రోడ్డు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్లను దొంగిలించిన ఘటనలు ఉన్నాయి. ఇప్పటి వరకు 8 ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్‌ను దొంగలు అపహరించినట్లు తెలిపారు. కాపర్ విలువ రూ.3.60 లక్షలు ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ రాజశేఖర్ ఆంధ్రజ్యోతితో తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

ఇద్దరు యువకులకు గాయాలు

జూలూరుపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలైన ఘటన గురువారం జూలూరుపాడులో జరిగింది. వివరాలు ఇలా.. జూలూరుపాడు దళిత కాలనీకి చెందిన గొల్లమందల సాయి, గోలి ప్రవీణ్‌లు ద్విచక్రవాహనంపై జూలూరుపాడులో డివైడర్ మధ్యలో నుంచి రోడ్డు అవతలి వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళుతున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ ఇద్దరి యువకులకు గాయాలు కావడంతో స్థానికులు వారికి వైద్య చికిత్సలను అందించేందుకు జూలూరుపాడులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌కు నిరసనగా 30న ఛత్తీస్‌గఢ్ బంద్

లేఖ విడుదల చేసిన మావోయిస్టు పార్టీ

చర్ల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మారేడుమిల్లి అడవుల్లో ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతో పాటు 13 మంది మావోయిస్టులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనలకు నిరసనగా ఈనెల 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్‌కు పిలుపు నిస్తున్నట్లు మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ గురువారం రాత్రి లేఖ విడుదల చేసింది. హిడ్మా ఎన్‌కౌంటర్ భూటకమని, బంధించి వారిని హత్య చేశారని, ఆపై ఎన్‌కౌంటర్ అని కట్టుకథ అల్లారని ఆ లేఖలో ఆరోపించారు. దీనిపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు దేవ్‌జీ, మరో 50మంది మావోయిస్టులను కూడా పోలీసులు అదుపులో తీసుకున్నారని, వారిని వెంటనే కోర్టులో హాజరు పరచాలని డిమాండ్ చేశారు. అలాగే విప్లవ ఉద్యమంపై జరుగుతున్న మారణ హోమాన్ని మావోయిస్టు పార్టీ, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, సెప్టెంబరు 21న కేంద్ర కమిటీ సభ్యులు కోసా దాదా, రాజు దాదా హత్యకు గురయ్యారని, అదికూడా భూటకపు ఎన్‌కౌంటర్ అని ఆరోపించారు. అడవుల్లో రోడ్లు కల్వర్టులు నిర్మిస్తున్నారని, విలువైన ఖనిజసంపదను దోచుకోవడం కోసమేనని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

రుణాలు ఇప్పిస్తానని.. ముఖం చాటేసి..

మోసగించిన వ్యక్తి ఇంటి ఎదుట బాధితుల ఆందోళన



మోసగించిన వ్యక్తి ఇంటి ఎదుట పెట్రోల్ బాటిల్‌తో ఆందోళన చేస్తున్న బాధితులు

అశ్వాపురం నవంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ట్రైకార్ రుణాలు, పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇప్పిస్తానంటూ రూ.లక్షల్లో డబ్బులు తీసుకుని ముఖం చాటేస్తున్న వ్యక్తి ఇంటి ఎదుట గురువారం పలువురు బాధితులు పెట్రోల్ బాటిల్‌తో ఆందోళనకు దిగారు. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అశ్వాపురంకు చెందిన ఓ వ్యక్తి మండల పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన తాటి భూదేవమ్మ, కణితి లలితలకు ట్రైకార్ రుణాలు ఇప్పిస్తానని వారినుంచి రూ.3 లక్షలు, బూర్గంపాడు మండలం ఇరవెండి గ్రామానికి చెందిన పాయం ధనలక్ష్మి అనే మహిళకు ఎస్టీ కార్పొరేషన్ రుణం ఇప్పిస్తానని చెప్పి రూ.2లక్షలు, పాల్వంచకు చెందిన చల్లా రామచంద్రయ్యకు పట్టాదార్ పాస్ పుస్తకం ఇప్పిస్తానని రూ.లక్ష తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. తమదగ్గర డబ్బులు తీసుకుని రెండు ఏళ్లు గడుస్తున్నా రుణాలు ఇప్పించకపోగా డబ్బులు అడిగితే ఆ వ్యక్తి వాయిదాలు వేస్తున్నాడు. గట్టిగా నిలదీస్తే ఏమిచేసుకుంటారో, చేసుకోండంటూ బెదిరింపులకు పాల్పడుతుండటంతో పెట్రోల్ బాటిల్‌తో మోసగించిన వ్యక్తి ఇంటి ఎదుట ఆందోళనకు దిగినట్లు తెలిపారు. కాగా బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలుసుకున్న అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని ఆందోళనాకారులను విరమింపజేశారు. అనంతరం వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

వివాదాలకు తెర

- వీధివ్యాపారుల దుకాణాల కేటాయింపునకు భారీ బందోబస్తు
- 210 దుకాణాలు వ్యాపారులకు కేటాయింపు
- ముందు ససేమిరా.. తర్వాత సరే...
- డ్రా తీసిన మేయర్ నీరజ, కార్పొరేటర్ పాలెపు విజయ



డ్రా తీస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ఐదేళ్లుగా ఒకేచోట కూరగాయల వ్యాపారం చేసిన కొంతమంది వ్యాపారులు దుకాణాలను మార్చేందుకు ససేమిరా అన్నారు.. ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు నిర్ణయించిన లాటరీవిధానానికి ససేమిరా అంటూ



అధికారులతో వాదనకు దిగిన వ్యాపారులు

వీధివ్యాపారుల ప్రాంగణంలో ఉండిపోయారు. తర్వాత ఒకరి తర్వాత మరొకరు రావటంతో ఖమ్మం నగరంలో వివాదస్పదమైన వీధివ్యాపారుల ప్రాంగణం మార్కెట్ వివాదాలకు తెరపడింది. మేయర్ పునుకొల్లు నీరజ,స్థానిక కార్పొరేటర్ పాలేపు విజయ సమక్షంలో నిర్వహించిన లాటరీలో 210 దుకాణాలకు వ్యాపారులను పునఃనియామకం చేశారు.

భక్తరామదాసు కళాక్షేత్రంలో డ్రా

వీధివ్యాపారుల ప్రాంగణంలోని కూరగాయల మార్కెట్‌లో గురువారం ఖమ్మంనగర పాలక సంస్థ ఆధ్వర్యంలో భక్తరామదాసు కళాక్షేత్రంలో భారీబందోబస్తు నడుమ లాటరీ ప్రక్రియను ఏర్పాటు చేశారు. లాటరీలో పాల్గొనేందుకు కొంతమంది వ్యాపారులు నిరాకరించారు. దీంతో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్, మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, మార్కెటింగ్ ఈవో శివరామకృష్ణ మార్కెట్‌కు చేరుకున్నారు. పారదర్శకత కోసం నిర్వహించే లాటరీలో పాల్గొనాలని అధికారులు వ్యాపారులను కోరారు. అందుకు కొంతమంది వ్యాపారులు ససేమిరా మేము రాం.. ఎంత అద్దెలైనా చెల్లిస్తా మంటూ భీష్మించారు.అధికారులతో గంటపాటు వాగ్వాదం చేశారు. అయితే భక్తరామదాసు కళక్షేత్రానికి వచ్చిన వ్యాపారులతో మేయర్ పునుకొల్లు నీరజ, స్థానిక కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ సమక్షంలో అధికారులు లాటరీ విధానం నిర్వహించారు. లాటరీ ప్రక్రియ ఒకవైపు కొనసాగుతుండగా మరో వైపు వ్యాపారులు భక్తరామదాసు కళాక్షేత్రానికి చేరుకున్నారు. తర్వాత 210 దుకాణాలకు డ్రాపద్ధతిలో వ్యాపారులను కేటాయించారు. ఖమ్మం రెండో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కేఎంసీ డీఆర్ఎప్ ఇన్‌చార్జీ బెల్లం రాధిక, మహాత్మాగాంధీ టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు జ్యోతి, సీవోలు చిలకా ద్రౌపది, జీ.ఉపేంద్ర, ఆర్పీలు సునీత, ఉమా పాల్గొన్నారు.

మీడియా సెంటర్ ప్రారంభం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్‌లో డీపీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి గురువారం ప్రారంభించారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా అందించాలని సూచించారు. ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని, ఎతికల్ ఓటింగ్, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలకు సంబంధించి సరైన సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్‌లోని ఎంసీఎంసీ కమిటీ అనుమతి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్వో ఎంఏ. గౌస్, డీపీవో ఆశాలత, అదనపు పీఆర్వో ఎండి. అయూబ్‌ఖాన్,ఎంసీఎంసీ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది చింతల శ్రీనివాస్ రావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ పాల్గొన్నారు.

పసుపుదళం సై

పంచాయతీ ఎన్నికల్లో పోటీకి సిద్ధమవుతున్న తెలుగుదేశం





నేలకొండపల్లి, తిరుమలాయపాలెం సమావేశాల్లో మాట్లాడుతున్న నాయకులు

నేలకొండపల్లి,నవంబరు27ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలల్లో పోటీ చేసేందుకు తెలుగుదేశం కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. పార్టీ ఉనికిని నిలబెట్టుకోవటానికి పంచాయతీ ఎన్నికలను ఆయుధంగా వాడుకోవాలని ప్రయత్నాలు ప్రారంభించింది. అభ్యర్థులను ఎంపిక చేసేందుకు కార్యకర్తల అభిప్రాయాలు తెలుసుకోవటానికి గురువారంసింగారెడ్డిపాలెంలో మండల సమావేశం నిర్వహించారు. మండలంలో గతంలో తెలుగుదేశం గెలుచుకున్న పంచాయతీలతో పాటు పార్టీకి బలమున్న పంచాయతీల్లో అభ్యర్థులను నిలపాలని పావులు కదుపుతోంది. అందులో భాగంగా గురువారం నేలకొండపల్లిలో మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో నిర్ణయం తీసుకుంది. అప్పలనర్సింహాపురం, మంగ్రాజుపల్లి, నేలకొండపల్లి, మూటాపురం, పైనంపల్లి, బుద్ధారం, రాయగూడెం గ్రామాల్లో పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మండలంలోని టీడీపి కార్యకర్తలు మాత్రం అన్ని పంచాయతీల్లో పోటీకి నిలవాలని భావిస్తున్నారని సమాచారం. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆరెకట్ల కొండలరావు, సూరపనేని రామకృష్ణ, నల మాస మల్లయ్య, వీసం శ్రీనివాసరావు, తీగ వెంకటేశ్వర్లు, అక్కినేనినాగేశ్వరరావు, మద్దినేని మహేష్, వంకాయలపాటి పద్మ, తాడేపల్లి వెంకటేశ్వరరావు, బండారు రాంబాబు, కోలేటి మస్తాన్‌రావు, నూక హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీల్లో టీడీపీ పోటీ

తిరుమలాయపాలెం: పంచాయతీ ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని పార్టీ జిల్లానాయకుడు కొండబాల కరుణాకర్ తెలిపారు. గురువారం మండలంలోని పాపాయిగూడెంలో పార్టీముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని 40 గ్రామపంచాయతీల్లో కలిసి వచ్చే పార్టీలతో పోటీ చేస్తామన్నారు. బీసీలకు టీడీపీ హయాంలోనే అధిక ప్రాధాన్యత ఇచ్చి వారిని చట్టసభల్లోకి పంపిన ఘనత టీడీపీదేనన్నారు. బడుగు, బలహీనవర్గాలు టీడీపీలో ఉన్నారనని, రానున్న పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నామా ప్రసాద్, కొప్పుల వెంకటరావు, కొలిశెట్టి భిక్షం, బాలకృష్ణ, మల్లెంపాటి లహరిన్, మల్లీడి సైదులు, వెంకన్న, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

ఖమ్మంస్పోర్ట్స్ నవంబరు27(ఆంధ్రజ్యోతి): నగరంలోని పెవీలియన్‌గ్రౌండ్‌లో గురువారం పలుఅభివృద్ధి పనులకు మేయర్ పునకొల్లు నీరజ శంకుస్థాపన చేశారు. గ్రౌండ్‌లో నిత్యం వాకింగ్ చేసే నడక సాధకుల విజ్ఞప్తి మేరకు వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ, విశ్రాంతి గదికి సంబందించిప పనులకు సుమారు రూ.5 లక్షలను విడుదల చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పాలెపు వెంకటరమణ, వాకింగ్ కమిటీసభ్యులు రామనాధం, శ్యాంబాబు,విజయ్,గోవర్ధన్,నర్సింహరావు, కోటయ్య, పద్మ,రమా శేఖర్,కళావతితదితరులు ఉన్నారు.

ఆలయ పునః ప్రతిష్ఠకు..

ఖమ్మంఖానాపురంహవేలి: నగరంలోని సీసీఎస్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న భక్తాంజనేయ స్వామి ఆలయ పునః ప్రతిష్ఠకు గురువారం జరిగింది. ఈకార్యక్రమానికిమేయర్ నీరజ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ కోన చంద్రశేఖర్, అర్చకులు హరీష్ ఆలయ పునఃప్రతిష్ఠకు శంకుస్థాపన చేశారు. ఆలయ అభివృద్ధికి మేయర్ రూ.20వేల రూపాయలు అందించారు.

ఆర్థికసాయం అందజేత



సీతారాములు కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

తిరుమలాయపాలెం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): కల్లూరు గురుకుల సంక్షేమ పాఠశాలలో పని చేస్తూ సీతారాములు ఇటీవల మృతి చెందారు. దీంతో గురుకుల పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జినక వెంకటేశ్వర్లుఆధ్వర్యంలో గురువారం రూ.40వేలను కుటుంబ సభ్యులకు అందించారు. ఈకార్యక్రమంలో సుజాత, స్వరూప,కమల నాగమణి పాల్గొన్నారు.

30న కబడ్డీ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే సీనియర్ పురుషుల, మహిళల జిల్లా కబడ్డీ జట్లను ఈనెల 30న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియోషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒకప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికచేసి వచ్చే నెల 11 నుంచి కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామన్నారు.

ఇంకా దొడ్డు బియ్యమే !

- నేలకొండపల్లి మండలం రేషన్ షాపుల్లో పంపిణీ
- ఆలస్యంగా వెలుగులోకి...



నేలకొండపల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కడుపు నిండేలా తెలంగాణా సర్కార్ రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తోంది.. కానీ అలవాటు ప్రకారంగా కొంతమంది రేషన్ డీలర్లు ఇంకా దొడ్డు బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నేలకొండపల్లిలోని 2240002 నెంబరు దుకాణంలో ఇటీవల దాదాపు 15మంది వరకు లబ్ధిదారులకు దొడ్డు బియ్యం ఇచ్చిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దొడ్డుబియ్యం తీసుకున్న వారు డీలర్‌తో వాగ్వాదానికి దిగారు. డీలర్ సైతం ఎక్కడా తగ్గకుండా ఎదురు దాడికి దిగాడు.

అసలు దొడ్డు బియ్యం ఎక్కడివి

ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి 6నెలలు దాటింది. 6నెలలైనప్పటికీ డీలర్ల దగ్గర ఇంకా దొడ్డు బియ్యం ఎక్కడివనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. గతంలో పంపిణీ చేయగా మిగిలిన దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం ఇంకా డీలర్ల వద్ద నుంచి తిరిగి తీసుకోలేదని సమాచారం. డీలర్ల వద్ద మిగిలి ఉన్న దొడ్డు బియ్యాన్నే కొంత మంది డీలర్లు అడపాదడపా పంపిణీ చేస్తున్నారు.గోడౌన్‌లో ఇంకా దాదాపుగా 1200 క్వింటాళ్ల దొడ్డు బియ్యం ఉన్నట్లు సమాచారం. డీలర్ల వద్ద మిగిలిన దొడ్డు బియ్యం నిల్వ చేసే ప్రదేశం లేక డీలర్ల వద్దనే ఉంచినట్లుగా సమాచారం. రేషన్‌షాపు ద్వారా లబ్ధిదారులకు దొడ్డు బియ్యం ఇచ్చిన డీలర్‌పై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం...

షాపు నెంబరు2240002 ద్వారాఇటీవల కొంత మంది లబ్ధిదారులకు దొడ్డు బియ్యం ఇచ్చిన విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా సదరు డీలర్‌ను పిలిచి మందలించినట్లు చెప్పారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్‌ఓరుగంటి వెంకటేశ్వర్లు చెప్పారు.

7న 'భలేమంచి రోజు'

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 7న ఘంటసాల జన్మదిన సందర్భంగా నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో భలేమంచి రోజు కార్యక్రమం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. గురువారం నగరంలోని నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ఇంద్రనోమిక సంగీత నాట్యాలయ నిర్వాహకులు భలే మంచి రోజు కన్వీనర్ ఎస్వీ రమణ, సునాదవినోదిని సంగిత సాహిత్య వేదిక తరపున లక్ష్మణ్‌బాబు, సుధాస్ ఎంటర్టైన్మెంట్ కార్యదర్శి శఠగోపం సుదర్శన్ మాట్లాడారు. ఈ సంవత్సరం జరిగే భలే మంచిరోజు స్వర్గీయ విజయ సారధి స్మృతికి అంకితం ఇస్తామని అన్నారు.

ఆలయానికి ఆనుకుని మద్యం దుకాణం?

- జమ్మిబండ వద్ద షెడ్డు నిర్మాణం
- ఈవో అనుమతి నిరాకరించినా, అనుమతిచ్చిన ఎక్సైజ్ శాఖ ?

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జమ్మిబండ వద్ద శ్రీస్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆనుకొని ఉన్న మరోస్థలంలో కొందరు మద్యం దుకాణం ఏర్పాటు చేసేందుకు నిర్మాణం ప్రారంభించారు. ఎన్నోఏళ్లుగా ఇక్కడ దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి దేవినవరాత్రులు ఘనంగా జరుపుతారు. చివరి రోజు స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి పారువేటకు బయలుదేరి జమ్మిబండ వద్దకు చేరుకుంటారు. ఆసందర్భంగా ఆ ప్రాంతం భక్తుల సమూహంతో సందడిగా మారుతుంది. వాస్తవానికి బడి, గుడి ప్రాంతాలలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే సుమారు 100 మీటర్ల దూరం అనంతరం ఏర్పాటు చేసుకోవాలి. కొందరు వ్యాపారులు ఇవేమి పట్టవంటూ ఆలయ భూమికి ఆనుకొని మద్యం షాపుకు షెడ్డునిర్మాణం చేశారని తెలిసింది. ఈవిషయమై స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈవో కొత్తూరు జగన్‌మోహన్‌రావును. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామిని వివరణ కోరగా నాలుగు రోజులక్రితం కొందరు అక్కడ మద్యం షాపు పెట్టుకుంటున్నట్లు అడిగారని, దానికి అక్కడ ఆలయ భూమి ఉందని ఏటా దసరాకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపి అనుమతి నిరాకరించామని తెలిపారు. దీంతో పాటు ఈవో ఎక్సైజ్‌శాఖకు అనుమతి ఇవ్వవద్దని లేఖ రాసినట్లు తెలిపారు. అయినప్పటికి కొందరు రెండురోజులుగా షెడ్డు నిర్మాణం జరుతున్నారు. అసలు అక్కడ మద్యం షాపా లేక ఇతర దుకాణమా అన్న విషయం మరి కొద్ది రోజుల్లో తెలియనున్నది.

మద్యంషాపు ఏర్పాటు చేయవద్దని నిరసన

స్తంభాద్రి లక్ష్మీ నర్సింహస్వామి వారి పారువేట స్థలం సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు.గుడిస్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రైవేటు స్థలంలో మద్యం దుకాణం ఏర్పాటుకు ప్రయత్నిస్తుంటే భక్తుల మనోభావాలతో చెలగాట మాడుతున్నట్టేనన్నారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు,గడీల నరేష్, శీలం పాపారావు,వీరవల్లి రాజేష్‌గుప్తా, సురేష్, మంద సరస్వతి, పాలేపు రాము పాల్గొన్నారు.



కొనసాగుతున్న బైండోవర్లు

నేలకొండపల్లి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో వివిధ కారణాలతో పోలీసులు బైండోవర్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు 74మందిని బైండోవర్ చేసినట్లు ఎస్ఐ పెంటరి సంతోష్ చెప్పారు. వీరిలో 37మంది బెల్టుషాపుల నిర్వాహకులు, ఆటోడ్రైవర్లు11మంది, మిగిలిన26 మందిలో ట్రబుల్ మాంగర్స్, రాజకీయ నాయకులు ఉన్నారు.

రఘునాథపాలెంలో 17 నామినేషన్లు



చిమ్మపూడి సర్పంచ్‌గా నామినేషన్ వేస్తున్న మాజీ వైస్‌ఎంపీపీ గుత్తా రవి

రఘునాథపాలెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో తొలి రోజే నామినేషన్లు ఊపందుకున్నాయి. మండల వ్యాప్తంగా 37 గ్రామపంచాయతీలుంగా 13 గ్రామ పంచాయతీల్లో 37గ్రామ పంచాయతీలకు కావాల్సిన ఎన్నికల ప్రక్రియ ఏర్పాట్లు చేశారు. గురువారం సర్పంచి కోసం 17మంది, వార్డు సభ్యులు కోసం 8మంది నామినేషన్లు అందించారు. చిమ్మపూడి సర్పంచి పదవికి మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి నామినేషన్ వేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు భారీగా తరలివచ్చారు. ఈర్లపూడి 1, జీకే బంజర 3, కొటపాడు 1, కేవీ బంజర 1, మంచుకొండ 1, పంగిడి 1, పాపటపల్లిలో మాత్రం 5, రాంక్యాతండాలో 1, రేగులచెలక 1, వీ వెంకటాయపాలెం 1 సర్పంచ్ పదవులకు నామినేషన్లు వేశారు. కాగా వార్డు సభ్యుల కోసం చిమ్మపూడిలో4, మంచుకొండ 1, కొటపాడు 1, కేవీబంజర 1, పాపటపల్లిలో 1 నామినేషన్ దాఖలు చేశారు.

ఖోఖో పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కల్లూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయిలో క్రీడాపోటీల్లో ఏన్కూరు గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖోఖోలో వి.సాత్విక్, ఎం.హేమచరణ్,షణ్ముక నాయక్, లేపాక్షి నందన్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అక్రమాన్ని కప్పిపెట్టేందుకు పాట్లు

- ఆగమేఘాలమీద సీసీ రోడ్డు నిర్మాణం
- వేయని రోడ్డుకు వేసినట్లు బిల్లుల స్వాహా చేసిన చోట పనులు



సిమెంట్ వేయని రోడ్డు (ఫైల్)

ఖమ్మంరూరల్, నవంబరు27(ఆంధ్రజ్యోతి): వేయని రోడ్డుకు వేసినట్లు బిల్లులు స్వాహచేసిన చోట ఆగమేగాలమీద సీసీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఖమ్మంరూరల్ మండలం, ఎం.వెంకటాయపాలెంలో 26సీసీరోడ్లకు రూ. కోటి నిధులు మంజురు అయ్యాయి. అయితే గ్రామంలోని పాపిట్ల గోపయ్య ఇంటిన ఉండి దొండేటి సత్యమయ్య ఇంటి వరకు రూ.4.60 లక్షల నిధులు మంజురు అయ్యాయి.ఈ రహదారిలో రోడ్డునిర్మాణం చేయలేదు. అయితే ఇక్కడ వేయని రోడ్డుకు వేసినట్లు ఎంబీ రికార్డుతో నిధులు స్వాహ చేశారు. దీంతో వేయని రోడ్డుకు ఎంబీ రికార్డుతో నిధులు స్వాహ అనే కథనం ఈనెల 20న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం విదితమే. దీంతో ఉన్నతాధికారుల మండల అధికారులకు చివాట్లు పెట్టినట్లు తెలిసింది. నిధులు స్వాహచేసి అధికారులు, కాంట్రాక్టర్లు రెండు నెలలక్రితమే దిగమింగిన డబ్బులను పంచుకోవడం జరిగిపోయింది. ఈ విషయం ఆంధ్రజ్యోతిలో ఆధారాలతో కథనం ప్రచురించడంతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై అధికారులు, గుత్తేదారులు వారంరోజులపాటు ఏంచేయాలో అర్థం కాక మల్లగుల్లాలు పడిటన్లు తెలిసింది. వెంటనే రోడ్డు నిర్మించాలని ప్రభుత్వ పెద్దలు ఆదేశించడంతో రెండురోజులుగా ఆగమేగాల మీద పాపిట్ల గోపయ్య ఇంటి నుండి దొండేటి సత్యమయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్తులు దీనిపై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.



సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

విత్తనబిల్లుతో రైతులకు నష్టం

ఖమ్మంఅర్బన్,నవంబరు27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనబిల్లు రైతులకు నష్టం కలిగించే విధంగా ఉందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. విత్తన ముసాయిదా బిల్లుకార్పొరేటే విత్తన కంపెనీల వ్యాపారం సులభతరం చేసేది ఉండగా రైతులకు మాత్రం నష్టం కలిగిస్తుందన్నారు. సన్న ధాన్యం బోనస్ మూడు కోట్లవరకు పెండింగ్‌లో ఉందని వెంటనే దానిని విడుదల చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేనిరమేష్, జిల్లాఉపాధ్యక్షుడు వాసిరెడ్డిప్రసాద్, ఎస్కే మీరా, సహాయ కార్యదర్శులు గొడవర్తి నాగేశ్వరరావు, బిక్కసానిగంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చివేత ఆపాలి

ఖమ్మంఅర్బన్,నవంబరు27(ఆంధ్రజ్యోతి): పేదప్రజల ఇళ్లకూల్చివేతను ఆపాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు యర్రా శ్రీనివాసరావు అన్నారు. పేదల ఇళ్లకూల్చివేతను నిరసిస్తూ గురువారం మునిసిపల్ కార్పొరేషన్ ముందు నిర్వహించిన ధర్నాలో మాట్లాడారు. 27,28,29,30 డివిజన్లలో మునిసిపల్ సిబ్బంది కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా పలు ప్రాంతాల్లో కూల్చివేతలకు పూనుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ నాయకులు ఎస్ నవీన్ రెడ్డి, పత్తిపాకనాగ సులోచన, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకటరావు, షేక్ ఇమాం తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు ప్రసాద్



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

ఖమ్మంఅర్బన్,నవంబరు27(ఆంధ్రజ్యోతి): సీపీఐ దివంగత నేత పోటు ప్రసాద్ నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు అని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా జమ్మిబండ వద్దఉన్న స్థూపం వద్ద సంస్మరణ సభఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థూపానికి ప్రసాద్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సభలో హేమంతరావు మాట్లాడుతూ పోటు ప్రసాద్ సీపీఐ విస్తరణకు ఎంతగానో కృషిచేశారన్నారు. పార్టీ తరుపున ఎన్నో ప్రజా ఉద్యమాల్లో పాల్గొనిబాధితులకు అండగా పోరాడారన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లాకార్యవర్గసభ్యుడు బీజీ క్లెమెంట్, నగర కార్యదర్శి షేక్ జానీమియా, తోటరామాంజనేయులు, పగడాలమల్లేష్, పోటు కళావతి, వరదనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తు గడువు పెంపు

ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శంకర్

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ గడువు డిసెంబరు1 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ 2 సంవత్సరాల కోర్సుల్లో 30 చొప్పున సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.అర్హులైన విద్యార్థులలో మొదటి ప్రాధాన్యత బైపీసీ విద్యార్థులకు ఉంటుందని, తర్వాత ఎంపీసీ, ఇతర విద్యార్థులకు తరువాత ప్రాధాన్యత ఇస్తామన్నారు. అభ్యర్థులు ముందుగా కళాశాల వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు ఫారం ప్రింట్ తీసుకొని అవసరమైన ధ్రువపత్రాలతో కలిపి డిసెంబరు1న సాయంత్రం ఐదు గంటల లోపు ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాలలో సమర్పించాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సూరిబాబుకు డాక్టరేట్

ఖమ్మంఖానాపురంహవేలి,నవంబరు27(ఆంధ్రజ్యోతి): నగరంలోని నలంద విద్యాసంస్థ, ఇన్స్పైర్ విజన్‌స్కూల్ అధినేత కూడారపు సూరిబాబు న్యూ హోప్ థియోలాజికల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు.బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుల చేతుల మీదుగా డాక్టరేట్ ప్రదానం చేశారు.

కాంగ్రెస్ పాలనలో అన్యాయం

బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు రాకేష్‌రెడ్డి

తిరుమలాయపాలెం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల వారికి తీవ్రంగా అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్రనాయకుడు రాకేష్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని జల్లేపల్లిలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లకావస్తున్నా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. సోషల్‌మీడియా మండల అధ్యక్షుడు బానోతు రవిని ఆయన పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాల ఎండగడుతున్నారన్న నెపంతో అక్రమ కేసులు పెట్టి మానసికంగా ఇబ్బదులు పెడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో పోట్ల జగదీష్, రాములు, శైలజ పాల్గొన్నారు. ఈసందర్భంగా జల్లేపల్లికి చెందిన కాంగ్రెస్‌పార్టీకి చెందిన ఆరుకుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం.. ముగ్గురికి గాయాలు

ఖమ్మంక్రైం, నవంబరు27(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పి ముగ్గురు యువకులు గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం రాత్రి ఖమ్మం నగర శివారులో జరిగింది. దానవాయిగూడేనికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తూ దానవాయిగూడెం కాలనీ వద్ద రైల్వేగోడను ఢీకొట్టారు.ఈప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావటంతో స్థానికులు నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

30న సీనియర్ కబడ్డీ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో పాల్గొనే సీనియర్ పురుషుల, మహిళల జిల్లా కబడ్డీ జట్లను ఈనెల 30న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి వచ్చే నెల 11 నుంచి 14 వరకు కరీంనగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని ఆయన తెలిపారు. ఎంపికల్లో పాల్గొనే పురుషులు 85 కేజీల లోపు, మహిళలు 75 కేజీల లోపు బరువు ఉండాలని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్‌తోఉదయం 9 గంటలకల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్

తల్లాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత శ్లోకాల కంఠస్థ పఠనధారణ పోటీలలో స్థానిక బాలభారతి విద్యార్థులు ప్రతిభను చాటి విజేతలుగా నిలిచారు. ఖమ్మం నగరంలో టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వందమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో బాలభారతి విద్యాలయం విద్యార్థులు తుటారి క్రిషిత ప్రథమ బహుమతి, కె.హేమాన్విత ద్వితీయ బహుమతి, ఆర్.రేష్మిత తృతీయ బహుమతి, సీనియర్ విభాగంలో కే.రిషిత ప్రథమ బహుమతి సాధించారు. ఈ విద్యార్థులను కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, డైరెక్టర్ శ్రావణి, ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, భగవద్గీత శ్లోకాల కంఠస్థ ఉపాధ్యాయురాలు డి.సునిత అభినందించారు.

టిప్పర్ బోల్తా



చింతకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనులకు మట్టిని తరలిస్తున్న టిప్పర్ లారీ గురువారం నాగిలిగొండ- పొద్దుటూరు రహదిరిపై బోల్తా పడింది. బ్రేకులు పనిచేయకపోవడంతో ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. ఘటనలో లారీ డ్రైవర్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.

పంచాయతీకి నామినేషన్లు మొదలు..

వైరాలో మొదటి రోజు 29 నామినేషన్లు దాఖలు

వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పంచాయతీలలో మొదటి రోజు గురువారం సర్పంచ్‌లకు, వార్డులకు కలిపి మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో ఖానపురంలో సర్పంచ్‌కు-2, కొండకోడిమలో సర్పంచ్‌కు-1, ఇతర గ్రామపంచాయతీలకు ఒకటి రెండు చొప్పున అభ్యర్థులు ఎన్నకల అధకారులకు నామినేషన్ పత్రాలిచ్చారు.



వల్లపురంలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న తుమ్మల సీతమ్మ

నామమాత్రంగా..



నామినేషన్ వేస్తున్న పిల్లలమర్రి నాగేశ్వరరావు

బోనకల్: మండలంలో 22 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. తొలిరోజు నామినేషన్లు వేసేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు ముందుకు రాలేదు. మండలంలో గురువారం 8 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 5గురు వార్డు సభ్యులుగా నామినేషన్లు వేశారు. ముష్టికుంట్ల కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా పిల్లలమర్రి నాగేశ్వరరావు నామినేషన్ వేయగా ఇతర పంచాయతీలలో కూడాఒకరిద్దరు నామినేషన్ వేశారు.

మొదటి రోజు మందకొడిగా..



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థి

చింతకాని: మండలంలో మొదటి రోజు నామినేషన్ల పర్వం మందకొడిగా కొనసాగింది. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొదుమూరు, పాతర్లపాడు నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించారు. సర్పంచ్‌కు 17, వార్డులకు 10 నామినేషన్లు దాఖలైనట్లు మండల అసిస్టెంట్ ఎన్నికల అధికారి శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్రాన్ని సందర్శించి అదనపు కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల, నవంబరు27(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల దృష్ట్యా తొలిరోజు శుక్రవారం నామినేషన్లు దాఖలయ్యాయి. 27గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల్లో తొలిరోజు సర్పంచ్‌కు 13మంది, వార్డులకు 9మంది నామినేషన్లు ఎన్నికల సిబ్బందికి అందించారు. మండలంలోని తనికెళ్ల నామినేషన్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. వెరిఫికేషన్ ఆఫీసర్ రామకృష్ణ, ఎంపీడీవో వర్ష, ఎంపీవో ఉపేంద్రయ్య పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్

మధిరలో 19 నామినేషన్లు దాఖలు

మధిర రూరల్: మధిర మండలంలో 27 గ్రామ పంచాయతీలకు గానూ తొలిరోజు గురువారం సర్పంచ్ స్థానాలకు 19, వార్డులకు 9 నామినేషన్లు దాఖలు చేశారు. మల్లారం, వెంకటాపురం, దెందుకూరు, మాటూరుపేట, మహాదేవపురం, తొండలగోపవరం పంచాయతీలల్లో ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలు కాగా, మాటూరు, రాయపట్నం, నక్కలగరుబు, కంభంపాడు, ఇల్లూరు గ్రామ పంచాయతీలకు రెండు చొప్పున నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు అత్కూరు, సిరిపురం గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలను సందర్శించారు.

వైరా ఇన్‌చార్జ్ ఏసీపీగా వసుంధర యాదవ్



వైరా, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైరా ఇన్‌చార్జ్ ఏసీపీగా వసుంధర యాదవ్ శుక్రవారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవలే కల్లూరు ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన వసుంధర యాదవకు వైరా ఏసీపీ ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు . ఇక్కడ ఏసీపీగా పనిచేసిన రెహమాన్ సెప్టెంబర్ 30న ఉద్యోగ విరమణ చేశారు. అప్పటినుంచి ఇక్కడ ఏసీపీ పోస్ట్ ఖాళీగా ఉంది. అటాచ్మెంట్పై వైరాకు రావలసిన ఎసీపీ సారంగపాణి ఉత్తర్వులను డీజీపీ రద్దుచేసి ఇటీవలే జీహెచ్ఎంసీలోని ఏసీపీ పి.శ్రీనివాసును వైరాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆయన ఇంకా బాధ్యతలు తీసుకోలేదు. కారణాలు తెలియ రాలేదు. దాంతో కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ వైరా ఇన్‌చార్జ్ ఏసీపీగా బాధ్యతలు తీసుకున్నారు. సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు

న్యాయం చేయాలని మృతుడి కుటుంబం రాస్తారోకో



ధర్నా చేస్తున్న మృతుని బంధువులు

చింతకాని, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): న్యాయం చేయాలని కోరుతూ మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో ఖమ్మం- బోనకల్ రహదారిపై మృతుని కుటుంబ సభ్యులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. రైల్వే కాలనీ గ్రామానికి చెందిన శెట్టిపోగు రంగారావు అనే ప్రైవేటు ఎలక్ట్రీషియన్ ఓ రైతుకు చెందిన వ్యవసాయ విద్యుత్ మోటారుకు మరమ్మతులు నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో బుధవారం మృతిచెందాడు. మృతుని కుటుంబానికి ఎటువంటి న్యాయం జరగలేదని న్యాయం చేయాలని కోరుతూ మృతుని కుటుంబ సభ్యులు రోడ్డు పై రాస్తారోకో నిర్వహించారు. దీంతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు రహదారి స్తంభించింది. సమాచారం తెలుసుకున్న వైరా సీఐ ప్రసాద్, ఎస్ఐ వీరేందర్ సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. ఇరువర్గాలతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అభ్యర్థుల ఎంపికపై కసరత్తు

» తలమునకలైన రాజకీయ పార్టీలు

కల్లూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విడుదల చేయడంతో కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక ఎన్నికల సమరంపై ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల వేటలో నిమగ్నమయ్యాయి. ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీలో పలు గ్రామాల్లో సర్పంచు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్లు సమాచారం. మండలం పరిధిలో 23 గ్రామ పంచాయితీలు ఉండగా, వాటిలో జనరల్ స్థానాలు 12 కాగా, బీసిలు 2, ఎస్సీలు 7, ఎస్టీలు 2 రిజర్వుడు అయ్యాయి. అయితే జనరల్ రిజర్వుడు అయిన గ్రామ పంచాయితీల్లో మాత్రం సర్పంచుగా బరిలో ఉండేందుకు గాను అధికార కాంగ్రెస్ పార్టీలో (జనరల్) ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులు తమ అభ్యర్థిత్వం కోసం పోటీలు పడుతున్నట్లు తెలిసింది. ఆ పార్టీ తరఫున అభ్యర్థిగా ఖరార్‌పై స్థానికంగా గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సమావేశమై అర్థ, అంగ, రాజకీయ ప్రాబల్యం, విజయ అవకాశాలు గల సమర్థులైన వారిలో ఒకరిని సర్పంచు అభ్యర్థిగా ఎంపిక చేసుకుని తమ దగ్గరకు రావాలని సత్తుపల్లి నియోజకవర్గ స్థాయిలో ఆ పార్టీ నాయకత్వం సూచించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇక ఎస్సీ ఎస్టీ, బీసీ రిజర్వుడు గల గ్రామ పంచాయితీల్లో అంతగా స్థానిక ఎన్నికల బరిలో ఉండేందుకు గాను ఆశావహులు ఆశక్తి చూపడం లేదని సమాచారం. కల్లూరు మండలంలో స్థానిక ఎన్నికల సమరంపై డిసెంబరు నెల 3 తేది నుంచి నామినేషన్ల పర్వం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ లోగా అభ్యర్థుల ఎంపిక పూర్తి చేయాలని నిర్ణయించినట్లు ఆ పార్టీ శ్రేణులు చెప్తున్నారు. ఇక ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కూడా రాజకీయంగా బలంగా ఉన్నందున సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నాయకత్వంలో త్వరలో మండల, గ్రామా స్థాయి సమావేశాలు నిర్వహించి ఆ పార్టీ తరఫున సర్పంచు అభ్యర్థుల పేర్లను ఖరార్ చేయనున్నట్లు తెలిసింది. ఇక వామపక్ష పార్టీల నాయకులు ఈ ఎన్నికల్లో రాజకీయంగా ఎలా వ్యవహారిస్తారేనని రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకత్వంపై వారి వ్యూహం ఆధార పడి ఉంటుంది.

కొణిజర: గ్రామపంచాయతీలలో సర్పంచ్, వార్డు అభ్యర్థులకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కావడంతో గ్రామంలో రాజకీయం వేడెక్కింది. ఒకపక్క నామినేషన్ల గడువు రెండురోజులే ఉండడంతో ఆయా గ్రామాల వార్డుల్లో సరైన అభ్యర్థులను నిలబెట్టేందుకు రాజకీయ పార్టీలు తర్జన భర్జన పడుతున్నాయి. సర్పంచ్‌లకు జనరల్ అయినచోట బీసీలకు చెందిన వారు కూడా పోటీలో ఉన్నారు. ప్రజల్లో పేరుతో పాటు డబ్బులు పెట్టగలిగే అభ్యర్థుల కోసం రాజకీయపార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. అధికారపార్టీలో ఎక్కువమంది పోటీలో ఉండగా అవకాశం లేని వారిని బుజ్జగించే ప్రయత్నం మండల నాయకత్వం ప్రయత్నం చేస్తోంది. కొంతమంది మాత్రం ససేమిరా అంటూ నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. శనివారంతో ఏ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎంతమంది నామినేషన్ వేస్తారో తేలనుంది.

కాలేజీ బస్సును ఢీకొట్టిన వ్యాన్..

తృటిలో తప్పిన ప్రమాదం



తమ్మిలేరు వాగు వద్ద లోయలో పడిన వ్యాన్

సత్తుపల్లిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ కాలేజీ బస్‌ను డీసీఎం లారీ ఢీకొన్న ప్రమాదం సత్తుపల్లి పట్టణంలోని తమ్మిలేరు వాగు వద్ద జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. మండలంలోని గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన బస్ 40మంది విద్యార్థులతో సాయంత్రం సత్తుపల్లికి వస్తుంది. సత్తుపల్లి వైపు నుంచి అతివేగంగా అజాగ్రత్తగా సిమెంట్ బస్తాల లోడుతో వస్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ పట్టణ శివారులోని తమ్మిలేరు వాగు వద్దకు రాగానే ప్రమాదవశాత్తూ కాలేజీ బస్సును ఢీకొట్టి పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. దీన్ని గమనించిన స్థానికులు స్వల్ప గాయాలైన డ్రైవర్‌ను ప్రైవేట్ అంబులెన్స్‌లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో కాలేజీ బస్సులో 40మంది విద్యార్థులు ఉండగా ఎవరికీ ఏమీ కాకపోవడంతో ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా కాసేపు ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు క్రమబద్ధీకరించారు.

మీడియా సెంటర్ ప్రారంభం

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కలెక్టరేట్ ఎఫ్ 3 లో డీపీఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎంసీఎంసీ)ను అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎన్నికలను సజావు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసినట్లు, ఎన్నికలు సక్రమంగా నిర్వహించడంలో పాత్రికేయులు తమ వంతు పాత్ర పోషించాలని, ఎతికల్ ఓటింగ్, ఓటు హక్కు ప్రాముఖ్యత గురించి ప్రజలకు వివరించాలని, ఎన్నికలకు సంబంధించి సరైన సమాచారం ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. మీడియా సెంటర్ ద్వారా పాత్రికేయులకు అవసరమైన సరైన సమాచారం సకాలంలో అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో వీడియోలు వినియోగించాలంటే ముందుగా మీడియా సెంటర్ లోని ఎంసీఎంసీ కమిటీని సంప్రదించి అనుమతి తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీపీఆర్వో ఎంఏ. గౌస్, డీపీవో ఆశాలత, అదనపు పీఆర్వో ఎండి. అయాబ్ ఖాన్, ఎంసీఎంసీ కమిటీ సభ్యులు, కార్యాలయ టైపిస్ట్ ప్రవళిక, కంప్యూటర్ ఆపరేటర్లు నవీన్, హరీష్, సిబ్బంది చింతల శ్రీనివాస్ రావు, చావా నారాయణ, తాజుద్దీన్, మంగ పాల్గొన్నారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



పునర్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

మధిర రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధిర రైల్వే స్టేషన్ వద్ద గల కోదండ రామస్వామి దేవాలయం, శివాలయం పునర్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమం గురువారం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఘనంగా నిర్వహించారు. ఆగస్త్య పీఠాధిపతి శ్రీ సుగుణానంద గాయత్రి స్వామి వారి చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని జరిపించారు. మధిర రైల్వే ఏడీఈఎం సత్య శ్రీనివాసరావు, కోనా జనార్దన్ రావు, మల్లాది వాసు, లక్కిరెడ్డి సుదాకరరెడ్డి దంపతులు ఈ సందర్భంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో నాగండ్ల ప్రసాద్, కళ్యాణం పుల్లారావు, నంబూరి శ్రీహరి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు మోడల్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్

కారేపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్‌జీఎఫ్ 69వ రాష్ట్రస్థాయి వేయిట్ లిఫ్టింగ్ పోటీలలో ప్రతిభ చూపి పతకాలతోపాటు జాతీయస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ గురువారం తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వేయిట్ లిఫ్టింగ్ పోటీలలో బి.పల్లవీ, వీ.ఉదయ్ కిరణ్‌లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వారు మహారాష్ట్రలో జరిగబోవు జాతీయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో పల్లవీ, ఉదయ్ కిరణ్‌లు బంగారు పతాకాలు సాధించగా ఎస్.సాత్విక్, జీ.జయశస్విని, ఎల్.అమూల్యప్రియ, కే.నిక్షేత, ఎం.భరత్ రజిత పతకాలు, వీ.మ్నేష్ కంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్, పీడీ.ముసామోనుద్దిన్ అభినందించారు.

ఘనంగా ఇరుముడి కార్యక్రమం



రూ. 50వేలు విరాళం అందిస్తున్న భాస్కరరావు

తల్లాడ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కుర్నవల్లి గ్రామంలో గురువారం అయ్యప్ప భక్తుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. స్థానిక అయ్యప్పస్వామి దేవాలయంలో ధర్మకర్త, గురుస్వామి అన్నెం కోటిరెడ్డి ఆధ్వర్యంలో 18మంది అయ్యప్ప స్వామి మాలధారులకు ఇరుముడి కట్టారు. ఈసందర్భంగా అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి ఇల్లెందు అయ్యప్ప దేవాలయం ధర్మకర్త కొప్పురావూరి భాస్కరరావు రూ.50వేలు నగదు విరాళంగా అందించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్, సొసైటీ డైరెక్టర్ పోతురాజు కోటయ్య పాల్గొన్నారు.

రైతులకు నష్టం కలిగించే విత్తనబిల్లు



రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సంఘం బాధ్యులు

ఖమ్మం అర్బన్ నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనబిల్లు రైతులకు నష్టం కలిగించే విధంగా ఉందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. గురువారం సీపీఎం జిల్లా కార్యాలయం సుందరయ్య భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేనిరమేష్ అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విత్తన ముసాయిదా బిల్లుకార్పొరేటే విత్తన కంపెనీల వ్యాపారం సులభతరం చేసేది ఉండగా రైతులకు మాత్రం నష్టం కలిగిస్తుందన్నారు. విత్తన కంపెనీల మోసాల విషయంలో నేర రహితం చేయటం కొద్దిపాటి పెనాల్టీలకు మాత్రమే పరిమితంగా ఉందన్నారు. నకిలీ విత్తనాల కారణంగా రైతులు నష్ట పోయిన సందర్భంలో పరిహారంసులభంగా పొందే అవకాశాన్ని సక్రమంగా పొందుపరచలేదన్నారు. కోర్టుల ద్వారా నే సమస్య పరిష్కరించుకోవాలనే విధంగా ఉందనానరు. విదేశాల్లో రిజిష్టర్‌అయిన విత్తనాలను భారత దేశంలో విక్రయించుకునే వీలు కల్పించటం అంటే విత్తన నియంత్రణ విదేశీ కంపెనీల చేతుల్లో పెట్టటమే అన్నారు. ముసాయిదా ప్రకారం నకిలీ విత్తనాలను నాణ్యతలేని విత్తనాలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించే అవకాశం లేదన్నారు. తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని గమనించి విత్తన ముసాయిదాను వ్యతిరేకించాలన్నారు. సన్న ధాన్యం బోనస్ మూడు కోట్లవరకు పెండింగ్‌లో ఉందని వెంటనే దానిని విడుదల చేయాలన్నారు. సమావేశంలో జిల్లాఉపాధ్యక్షుడు వాసిరెడ్డి ప్రసాద్, ఎస్కే మీరా, సహాయ కార్యదర్శులు గొడవర్తి నాగేశ్వరరావు, బిక్కసానిగంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సత్తుపల్లి శివారు ప్రాంతాలు



జ్యోతినిలయం స్కూల్ దాటిన తర్వాత చీకటిమయంగా రహదారి



అంధకారంగా వేంసూర్ రోడ్‌లోని ఎన్టీఆర్ నగర్‌కు వెళ్లే రహదారి

సత్తుపల్లిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణానికి ముఖద్వారంగా నిలిచే ప్రాంతాలే నేడు అంధకారంగా మారాయి. పట్టణానికి మూడు వైపులా శివారు ప్రాంతాలలో వెలుగులు లేకపోవడంతో ప్రమాదాలు అధికంగా చోటుచేసుకుంటుండగా ముఖ్యంగా బాటసారులు నడిచేందుకు వీలుగా లేదని వాపోతున్నారు. జ్యోతినిలయం నుంచి హిందూ స్మశాన వాటిక వరకు సెంట్రల్ లైటింగ్ విత్ డివైడర్ గతంలో ఏర్పాటు చేయగా పట్టణంలో వెలుగులకు కొదవేలేదు. వెంగళరావు నగర్ నుంచి జ్యోతి నిలయం స్కూల్ వరకు, ఫ్లైఓవర్ దాటిన తర్వాత తమ్మిలేరు బ్రిడ్జీ దాటిన తర్వాత, ఎన్టీఆర్ నగర్ శివారు ప్రాంతాలన్నీ విద్యుత్ దీపాలు ఏర్పాటు లేక చీకటిమయంగా మారాయి. సంబంధిత మునిసిపల్ అధికారులు గానీ, సింగరేణి సంస్థ గానీ పర్యవేక్షించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంత ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు. ఇదే విషయమై సింగరేణిలోని జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, మునిసిపల్ కమిషనర్ కొండ్రా నర్సింహులను వివరణ కోరగా పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు.

లయన్స్‌క్లబ్ ఆఫ్ సత్తుపల్లికి అంబులెన్స్ వితరణ



అంబులెన్స్‌ను అందజేస్తున్న దాతలు

సత్తుపల్లిరూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన ఆలివ్ ఫౌండేషన్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లికి గురువారం రూ.8.5లక్షల విలువైన అంబులెన్స్ వాహనాన్ని వితరణగా అందజేశారు. పట్టణంలోని రాజీవ్ రోడ్‌కు చెందిన విశ్రాంతి ఉపాధ్యాయులు గాదె ఉమామహేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, ఆలివ్ ఫౌండేషన్ బాధ్యులు కమల, భారతి, సుజాతలు ప్రారంభించారు. అనంతరం కళాభారతిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐడోనేషన్ సెంటర్‌ను లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్‌మోహన్ రేపాల, దారా కృష్ణారావులు ప్రారంభించారు. కార్యక్రమంలో మందపాటి ప్రభాకరరెడ్డి, గోగడ రవి, గండ్ర సోమిరెడ్డి, పెనుగొండ రమేష్, జంగా సత్యనారాయణ, నగేష్, రావి నాగేశ్వరరావు, ఉడతనేని అప్పారావు, కొత్తూరు ఉమామహేశ్వరరావు, జీవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఏన్కూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో ఏన్కూరు గురుకుల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఖోఖోలో వి.సాత్విక్, ఎం. హేమచరణ్, షణ్ముక నాయక్, లేపాక్షి నందన్ వికారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ వేముల రాజు, ఏటీపీ శ్రీనివాస్, డిప్యూటీ వార్డెన్ జమునారాణి, అంజాద్‌పాషా, పీఈటీ వీర, పీడీ సునిల్, ఉపాధ్యాయులు లక్ష్మి, సునిల్, విశ్వేశ్వరరావు, రజని, విజయకుమారి, కుటుంబరావు, శ్రీనివాసరెడ్డి, శివకుమార్, సతీష్, నరసింహారావులు అభినందించారు.



మంత్రులను కలిసిన నూతి



మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌లను కలిసిన డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ

వైరా నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడుగా ఎన్నికైన నూతి సత్యనారాయణ గురువారం హైదరాబాద్‌లో రాష్ట్రమంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలను మరద్యపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ అధ్యక్షుడు పూవ్వాళ్ళ దుర్గాప్రసాద్‌లో కలిసి మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మంత్రులను నూతి సత్యనారాయణ శాలువాలతో సన్మానించారు.